


పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# మల్లంపేట్‌లో రోడ్డు ఆక్రమణలతో...
# ట్రాఫిక్ కష్టాలు



- 100 అడుగుల రోడ్డు ప్రతిపాదనతో ఇళ్లు కోల్పోతామనే భయం..
- 30 అడుగుల రోడ్డుతో ట్రాఫిక్ జామ్‌లకు ప్రజలు ఇబ్బందులు..

- ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ట్రాఫిక్ సమస్యపై రోడ్డుపైకొవచ్చి ప్రజల పోరాటం..!
- ఆటంకాలు లెక్క చేయకుండా 100 ఫీట్ల రోడ్డు ప్రతిపాదనే లక్ష్యంగా, దృష్టి పెట్టాలి..
- ట్రాఫిక్‌కు నియంత్రణలో భాగంగా, యూటర్న్ దూరం పెంపు..
- యూటర్న్ తీసుకోవాలంటే, కాజిపల్లి వరకు పరుగులు పెట్టాల్సిందేనట..!
- నాడు ఓఆర్ఆర్ కోసం భూములు కోల్పోయాం.. ఇళ్లు కూడా కోల్పోవాలా..?
- రోడ్డున పడే కుటుంబాలకు ప్రభుత్వ భూముల్లో స్థలాలు ఇవ్వాలని డిమాండ్..!
- మల్లంపేట్‌లో మాజీ కౌన్సిలర్ రోడ్డుకు అడ్డంగా పెట్టిన గేటు తొలగింపు ఎప్పుడు..?

మల్లంపేట్‌లో రోడ్డుకు అడ్డంగా గేటు.. చర్యలులేక మూడేళ్ళు..

- ఓల్డ్ హైదరాబాద్, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ రోడ్లు తెరవాలంటూ డిమాండ్..!
- మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకన్న రోడ్డు ఆక్రమణపై చర్యలేవి డిప్యూటీ కమిషనర్..
- నేతల సిఫార్సులకు జీ హుజూర్ అంటున్న అధికారులూ..!
- వాళ్ళ ఇంటి వద్దే విధులు నిర్వర్తిస్తే బాగుంటుందేమో..?

మల్లంపేట్‌లో ట్రాఫిక్ సమస్య తీరాలంటే..! ముందు నేతల సిఫార్సులకు చెక్ పెట్టాలి.. కానీ అధికారులు నేతల పట్ల మెప్పు పొందటానికి.. విధులు తాకట్టు పెడుతున్నారు.. రోడ్డు విస్తరణలో భాగంగా వెళ్ళిన అధికారులు ఎవరైనా.. సిఫార్సుల ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే ఏదో పిట్టకథలు వినిపించడం మామూలే.. ప్రజల ఓట్లతో గెలుపొందిన నేతలు, ఆ ప్రజలను ట్రాఫిక్ సమస్యలకు గురిచేస్తుండగా..? ప్రల సొమ్మును వేతనాలుగా పొందుతున్న ప్రభుత్వ అధికారులు, ఆ ప్రజలనే ప్రమాదంలో పెడుతున్న అంశాలు అనేకం.. దుండిగల్ సర్కిల్ సిఎంసి మల్లంపేట్‌లో, ఏళ్లు గడుస్తున్నా..! ప్రభుత్వాలు మారుతున్నా..! మల్లంపేట్ ప్రజల రోడ్డు, ట్రాఫిక్ కష్టాలకు మాత్రం మోక్షం లభించడం లేదని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, రోడ్లపై నిరసన ర్యాలీ నిర్వహించారు.. సమస్య తీవ్రత అధికారుల దృష్టికి వెళ్లినా శాశ్వత పరిష్కారం చూపలేక ఫతున్నరాని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ప్రజలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడటానికి కారణం, అధికార యంత్రాంగమే కదా.. ఒకవైపు 100 ఫీట్ల రోడ్డు ప్రతిపాదనతో ఇళ్లు కోల్పోయే భయం.. మరోవైపు 30 ఫీట్ల రోడ్డుకే డివైడర్లు పెట్టి ట్రాఫిక్‌ను మరింత జటిలం చేయడం ఏమిటని ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.. ప్రభుత్వ నిర్లక్ష్యానికి మల్లంపేట్ ప్రజలు మూల్యం చెల్లించాల్సి వస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. ఈ నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టి, తక్షణమే సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు..

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 11:

-4లో





01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కేశవరావు పిల్లల స్థలాల క్రమబద్ధీకరణపై వైఖరి చెప్పండి

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారు కేశవరావు కుమారుడు కె.వెంకటేశ్వరరావు, కుమార్తె గద్వాల విజయలక్ష్మిలకు అనుకూలంగా ఇచ్చిన క్రమబద్ధీకరణ ఉత్తర్వుల వ్యవహారంపై వైఖరి ఏమిటో చెప్పాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖతో చర్చించాలని, అలాగే అవసరమైతే గతంలో ఇచ్చిన క్రమబద్ధీకరణ ఉత్తర్వులను సవరించాలంటూ ఈ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఏం చర్యలు తీసుకున్నారన్నదానిపై సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది కేశవరావు కుమారుడు, కుమార్తె స్థలాలను క్రమబద్ధీకరిస్తూ 2023 మే 23న గత భారాస ప్రభుత్వం జారీ చేసిన జీవో 56ను సవాలు చేస్తూ సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన జి.రఘువీర్‌రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దానిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. అడిషనల్ అడ్వొకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ ఇరుపక్షాల మధ్య వ్యక్తిగత కక్షలను తీర్చుకోవడానికి ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారన్నారు. పిటిషనర్‌పై ఇప్పటికే దోపిడీ కేసు కూడా నమోదైందని తెలిపారు. ప్రభుత్వ వాదనను తెలియజేయడానికి మరో 4 వారాల గడువు కావాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయం చెప్పడానికి ఉత్తర్వులు ఇచ్చి దాదాపు 9 నెలలు గడిచిందని, మళ్లీ ఇప్పుడు అదనంగా గడువు కోరడం సరికాదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం ఈ విషయాన్ని తొక్కిపెట్టినట్లుగా ఉందని వ్యాఖ్యానించింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయడానికి చివరి అవకాశమని చెబుతూ విచారణను సెప్టెంబరు 3కు వాయిదా వేసింది. సంబంధిత శాఖ వివరణను రికార్డుల్లోకి తీసుకురావాలని స్పష్టం చేసింది.

## వచ్చే నెల నుంచే

# 'పత్తి సీజన్'

## 131 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు: మంత్రి తుమ్మల



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల సీజన్‌ను సెప్టెంబరు నుంచే ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో 2026–27 పత్తి సీజన్‌పై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. "రాష్ట్రంలో 46.33 లక్షల ఎకరాల్లో... 25.85 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తిని అంచనా వేస్తున్నాం. కొనుగోళ్ల కోసం 131 కేంద్రాలను, జిన్నింగ్ కోసం 356 మిల్లులను ప్రారంభించాలి. ఎక్కడైనా జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే, సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లులకు అనుసంధానం చేయాలి. ప్రతి జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలి. అందులో రైతు ప్రతినిధులను చేర్చాలి. అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని పొడిగించాలి. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళతరం చేయాలి.

-4లో

# మల్లంపేట్‌లో రోడ్డు ఆక్రమణలతో.. ట్రాఫిక్ కష్టాలు..





**నాయకులు, గ్రామస్తుల భాగస్వామ్యంతో ఈ నిరసన కార్యక్రమంలో బౌరంపేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పిసరి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎంబర్ ఆంజనేయులు ముదిరాజ్, సీనియర్ నాయకులు డి.ప్రభాకర్ రెడ్డి, ఆర్.నర్సింహాచారి, దళిత మోర్చా నాయకులు ఎస్.నర్సింగ్ రావు, తలారి రాము, డివిజన్ ప్రధాన కార్యదర్శి దమ్మగారి సీతారాం రెడ్డి, లక్ష్మారెడ్డి, గణేష్, యువ మోర్చా నాయకులు సారా నవీన్, కొండ శ్రీకాంత్, సందీప్, కే.గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.. బీజేపీ నిర్వహించిన కార్యక్రమానికి మద్దతుగా గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఆవుసుల యాదయ్య, ఆవుసుల అంజయ్య, ఎండీ ఉస్మాన్, వడ్ల నర్సింహా తదితర గ్రామస్తులు పాల్గొన్నారు..**

## ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలేవి..?

మల్లంపేట్‌లోని ప్రభుత్వ భూములను కొందరు అక్రమంగా ఆక్రమించి చిన్నచిన్న ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడి, ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. రహదారి విస్తరణతో నష్టపోయే కుటుంబాలకు అదే ప్రాంతంలో ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయిస్తే సమస్యకు మానవీయ పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు..

- 3 పేజి తరువాయి

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధి మల్లంపేట్‌లో రోడ్డు ఆక్రమణల పట్ల, అధికారుల నిర్లక్ష్య వైఖరి, ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..గత కొన్నేళ్ళుగా ప్రజలు ఎదుర్కొంటున్న, ఈ ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం విఫలమయ్యాయని నిరసన కారులు ఆరోపిస్తున్నారు.. బీజేపీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో కలిసి, మంగళవారం శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రహదారుల అభివృద్ధి చేపట్టకుండా, చిన్నపాటి రహదారికి కూడా మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయడం వల్ల స్థానికులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.. మల్లంపేట్‌లో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో గతంలో 100 అడుగుల రోడ్డు ప్రతిపాదన తెరపైకి వచ్చిందని, ప్రస్తుతం 30 అడుగుల రహదారికే పరిమితం చేసి, మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయడం వల్ల సమస్య మరింత ఎక్కువైందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.. 100 అడుగుల రోడ్డు ప్రతిపాదన అమలైతే, ఇప్పటికే ఔటర్ రింగ్‌రోడ్ కోసం భూములు కోల్పోయిన స్థానికుల్లో కొందరు తమ ఇళ్లను కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు..

## ప్రత్యామ్నాయ మార్గాలు.. తాత్కాలిక ఉపశమనం మాత్రమే..

ఓల్డ్ హైదరాబాద్ రోడ్లు, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన రోడ్లను వెంటనే తెరిస్తే మల్లంపేట్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని నాయకులు సూచించారు.. ప్రస్తుతానికి రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ల కారణంగా వాహనదారులు యూటర్న్ కోసం కాజిపల్లి చౌరస్తా వరకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు.. మల్లంపేట్ బస్‌స్టాప్ అవతల నుంచి బాచుపల్లి వైపు వచ్చే వాహనాలను కాజిపల్లి రోడ్డు వైపు మళ్లించడం, బౌరంపేట్--ఓఆర్ఆర్ వైపు నుంచి వచ్చే వాహనాలకు వన్‌వే విధానం అమలు చేయడంతో పాటు అవసరమైన చోట డివైడర్లను తొలగిస్తే తాత్కాలికంగా ట్రాఫిక్ సమస్యకు కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉందన్నారు.. మరోవైపు ప్రత్యామ్నాయ మార్గాలు, కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు..

## రోడ్డుకు అడ్డంగా గేటు.. మూడేళ్లుగా చర్యలు శూన్యం..!

మల్లంపేట్‌లోని మాదాసు రామచంద్ర కాలనీలో 2022-23లో మున్సిపల్ నిధులతో సుమారు రూ.7.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డుకు అడ్డంగా బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ అక్రమంగా గేటు నిర్మాణం రోజు రోజుకు వివాదాస్పదంగా తయారవుతోంది.. ప్రజల డబ్బుతో నిర్మించిన రహదారికి అడ్డంగా గేటు ఏర్పాటు చేసి మూడేళ్లు గడుస్తున్నా.. అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోక పోవడం ప్రశ్నలను లేవనెత్తుతోంది.. ఇటీవల అదే ప్రాంతంలో చిరు వ్యాపారుల బండ్లపై చర్యలు తీసుకున్న దుండిగల్ సర్కిల్ సిఎంసి అధికారులు..మరోసారి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.. మరి రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన మాజీ కౌన్సిలర్ గేటు ఆక్రమణ కాదా..? అన్న ప్రశ్నలు పెడచెవిన పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది.. డిప్యూటీ కమిషనర్ హెచ్చరికలు ఈ మాజీకి వర్తించవా అంటూ నిలదీస్తునగనారు.. మాజీ కౌన్సిలర్ అనే హోదా చట్టానికి రక్షణ కవచమా..? గేటును తొలగించడానికి ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు..? రాజకీయ ఒత్తిళ్లు..! సిఫార్సులు ఉంటే.. వదిలేస్తారా..? చట్టం అందరికీ సమానమైతే.. ఈ గేటు ఎందుకు తొలగించరు..?

## రోడ్డుకోల్పోయే వారికి ప్రభుత్వ భూముల్లో స్థలాలు ఇవ్వాలి..!

**100 అడుగుల రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయే స్థానికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన కుటుంబాలు, ఇప్పుడు ఉన్న ఇళ్లను కూడా కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.. మల్లంపేట్‌లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయే అర్హులైన స్థానికులకు స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు..**

## బీఆర్ఎస్-కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు..

**గత పదేళ్లుగా బీఆర్ఎస్, ప్రస్తుత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ.. మల్లంపేట్ ప్రజల రోడ్డు, ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కాలేదని బీజేపీ నాయకులు విమర్శించారు.. ప్రజా సమస్యలపై అధికార పార్టీలు దృష్టి సారించకుండా ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు.. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు..**






---

# వచ్చే నెల నుంచే ‘పత్తి సీజన్’

- 3 పేజి తరువాయి

జిన్నింగ్ మిల్లుల్లో తేమ శాతం తదితర నాణ్యత ప్రమాణాలను పరీక్షించే పరికరాలుండాలి. రైతుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం 1800 599 5779 టోల్‌ఫ్రీ సహాయకేంద్రం, 88972 81111 వాట్సప్ చాట్‌బాట్ సేవలు ప్రారంభించాలి. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకుని, ఈ సీజన్‌లో అటువంటి లోపాలు, అవకతవకలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి” అని స్పష్టం చేశారు. సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తా, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, కాటన్, జిన్నింగ్ మిల్లుల సంఘం అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి తీరుపై హుజురాబాద్ జర్నలిస్టులు మండిపాటు

## రేపటి నుంచి ఆందోళనలకు పిలుపు..

**హైదరాబాద్ పెన్ పవర్:** హుజురాబాద్ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల వివాదంపై స్పందించడానికి నిరాకరించడమే కాకుండా, స్వపక్ష ప్రభుత్వంపైనే తీవ్ర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు గూడూరి స్వామి రెడ్డి వైఖరిని నిరసిస్తూ రేపటి నుంచి దశలవారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శి కాయిత రాములు, కామని రవీందర్ లు ప్రకటించారు.

గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలపై స్వామి రెడ్డి కోర్టులో కేసు వేసిన నేపథ్యంలో, సమస్యను పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆయన స్వగ్రామమైన ఇప్పల నర్సింగాపూర్ లో ని ఆయన గృహానికి వెళ్లి బొకే ఇచ్చి విజ్ఞప్తి చేశారు. అయితే, కేసును ఉపసంహరించుకోవడానికి ఆయన నిరాకరించినట్లు వారు పేర్కొన్నారు.

ఈ క్రమంలోనే గూడూరు స్వామి రెడ్డి స్పందిస్తూ... "ఇదో చెత్త ప్రభుత్వం, ఈ ప్రభుత్వంతో పనులు అయ్యేది లేదు.. పోయేది లేదు" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వారు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హుజురాబాద్ నియోజకవర్గంలో అన్ని రకాల ప్రయోజనాలు పొందిన స్వామి రెడ్డి, సొంత ప్రభుత్వంపైనే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వచ్చాక తన సతీమణి గూడూరు రాజేశ్వరిని మార్కెట్ చైర్మన్‌గా నామినేట్ చేయించుకోవడంతో పాటు, ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో కోడలు గూడూరు అంజలి ను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేయడంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబుతో పాటు మంత్రుల సహకారాన్ని ఆయన పూర్తిగా వాడుకున్నారని జర్నలిస్టులు గుర్తుచేశారు.సొంత పదవుల కోసం ప్రభుత్వాన్ని వాడుకుని, జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో మాత్రం పట్టుదలకు పోతూ ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది.బొకే ఇవ్వడానికి వెళ్లిన జర్నలిస్ట్ ప్రతినిధుల పట్ల ఆయన వ్యవహరించిన తీరుకు నిరసనగా రేపటి నుంచి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, కార్యదర్శి కామని రవీంద ర్ లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు కోరం సుధాకర్ రెడ్డి,నంబీ భరణికుమార్ , కేదాసి శ్రీధర్, టేకుల సాగర్, ఎడ్ల కుమార్,నిమ్మటూరి సాయి కృష్ణ, పబ్బతిరుపతి, మచ్చిక చందు, గొపగాని మహేష్, ఎన్ టివి రాజు, పోతరాజు సంపత్,పయిమ్, నాగవెల్లి రాజు,భారత రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు

**బాలానగర్: పెన్ పవర్:** సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల(మీవీజు) అభివృద్ధి చట్టం -2026 సవరణ బిల్లుకు లోకసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో..బాలానగర్ లోని మీవీజు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీవీజు ఇంఛీా జాయింట్ డైరెక్టర్ సి.శివ శేషగిరి రావు మాట్లాడుతూ..20 ఏళ్ల తర్వాత ఇప్పుడు చేసిన సవరణ బిల్లు లో చట్టపరమైన వ్యవస్థ ,వ్యాపార సౌలభ్యం,సమస్యల పరిష్కారం లాంటి అంశాలు త్వరగా పరిష్కారం అవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సవరించిన చట్టంలో పెట్టుబడి,టర్నోవర్ ఆధారంగా ఎంఎవ వర్గీకరణను చట్టబద్ధం చేయడం, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ఉద్యమ్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాక గడిచిన మూడేళ్ళలో 1.65 కోట్ల నుంచి వినియోగదారులు 9.16 కోట్లకు పెరిగాయని ,దేశ వ్యాప్తంగా 40కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్స్ దశరథ్, ఎన్. సుమతి, గుళషన్ సింగ్ బిస్ట్, గురు స్వామి, నవీన్ కుమార్, దినేష్ కుమార్ పాల్గొన్నారు.

## ఒకే చోట ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతి

**వికారాబాద్: పెన్ పవర్:** యాలాల మండలం కోకట్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఒకే చోట ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది.రాత్రి భోజనం చేసి మద్యం సేవించిన అనంతరం నిద్రించిన ఇద్దరు.. ఉదయం లేచి చూసేసరికి విగతజీవులుగా కనిపించారు.మృతులిద్దరూ వరుసకు మామా అల్లుళ్లు కావడం గమనార్హం.

**వివరాల్లోకెళ్తే..**

యాలాల మండలం

కోకట్ పరిధిలోని సుమిత్‌కు చెందిన స్టోన్ పాలిష్ ఇంట్లో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

పోలీసులకు అందిన ప్రాథమిక సమాచారం మేరకు.. అబ్దుల్ లయాఖత్, వయసు 45 సంవత్సరాలు, గోరెప్ప, వయసు 32 సంవత్సరాలు ఒకే చోట ఉంటున్నారు.వీరిద్దరూ వరుసకు మామా అల్లుళ్లు అని సమాచారం.

ఎప్పటిలాగే రాత్రి ఇద్దరూ కలిసి భోజనం చేశారు. అనంతరం మద్యం సేవించి నిద్రకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.అయితే ఉదయం లేచి చూసేసరికి ఇద్దరూ మృతి చెంది ఉండటంతో విషయం వెలుగులోకి వచ్చింది.ఒకే చోట ఇద్దరు మృతి చెందడంతో స్థానికంగా కలకలం రేగింది.అయితే మృతుల శరీరాలపై ఎలాంటి గాయాలు లేదా దెబ్బల గుర్తులు కనిపించలేదని ప్రాథమికంగా పోలీసులు తెలిపారు.ఇద్దరి మృతికి అసలు కారణం ఏమిటన్నది ప్రస్తుతం తెలియాల్సి ఉంది.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల అసలు కారణం స్పష్టమయ్యే అవకాశం ఉంది.మద్యం సేవించడం వల్లే మృతి చెందారా..? లేక మరేదైనా కారణం ఉందా..? అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.ఒకే చోట ఇద్దరు మృతి చెందడంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ.. పోలీసుల దర్యాప్తు, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులో మహిళ పర్సు చోరీ

### పర్సు పోయిందంటూ మహిళ ఆందోళన.. ప్రయాణికులతో బస్సును పోలీస్స్టేషన్కు తరలింపు

### చిలకలపూడి పోలీస్స్టేషన్ వద్ద ప్రయాణికుల అవస్థలు

**మచిలీపట్నం పెన్ పవర్:** మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ ప్రయాణికుల బస్సులో ఓ మహిళ పర్సును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన ఘటన సోమవారం కలకలం రేపింది. ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సులో చోరీ జరగడంతో తోటి ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. మచిలీపట్నం నుంచి ఉయ్యూరు వెళ్తున్న బిందు అనే మహిళ తన పర్సు కనిపించడం లేదని గుర్తించి బస్సులోనే ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో బస్సును చిలకలపూడి పోలీస్స్టేషన్కు తరలించారు.

## కలగర లో భారీ చోరీ

**హైదరాబాద్ పెన్ పవర్:**

విస్సన్నపేట మండలం కలగర గ్రామంలో ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. కలగర గ్రామానికి చెందిన (పోస్ట్ మాస్టర్) పసుపులేటి శ్రీనివాసరావు ఇంట్లోకి చొరబడిన దుండగులు సుమారు భారీగా బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. విషయం తెలుసుకున్న విస్సన్నపేట ఎస్సై ఎం అర్జున్ రావు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. దుండగుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

## నారాయణపూర్ ముంపు బాధితుల పోరాటం

### "ఇళ్లకు కాదు.. గ్రామానికే పరిహారం ఇవ్వాలి"

### బాధితులకు అండగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లాలోని గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో చెరువు విస్తరణ, ఎల్లంపల్లి జలాశయం నుంచి నీటి నింపుదలతో ముంపు ముప్పు పెరిగిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు విస్తరణ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడంతో పాటు, కట్ట కింద ఉన్న కొన్ని ఇళ్లకు మాత్రమే పరిహారం మంజూరు చేయడాన్ని గ్రామస్థులు వ్యతిరేకిస్తున్నారు.నారాయణపూర్‌తో పాటు ఇస్తారుపల్లి, చర్లపల్లి, ఎన్.మంగపేట గ్రామాలకు ముంపు భయం ఉందని, గ్రామంలోని సుమారు 300 కుటుంబాలకు పరిహారం అందించి మొత్తం గ్రామాన్నే ముంపు గ్రామంగా ప్రకటించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఎన్నికల సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీలు ఇచ్చారని ... ఇప్పుడుముంపు సమస్యపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయపెడుతున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో నమోదైన కేసులను ఎత్తివేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో నారాయణపూర్ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీక్షకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సంఘీభావం తెలిపి బాధితులకు అండగా నిలిచారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, తమ సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రజలపై కేసులు పెట్టడం సరికాదని సుంకె రవిశంకర్ విమర్శించారు.

# ఇది ఎన్నో ఇండిపెండెన్స్ డే.. 79.. 80..? ఏది కరెక్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 స్వాతంత్ర్య దినోత్సవం వచ్చేసింది. ఆగస్టు 15న ఇండిపెండెన్స్ డే ఉన్న సందర్భంగా.. ఇది ఎన్నో స్వాతంత్ర్య దినోత్సవం అనే కన్ఫ్యూ జన్ ఉంటుంది. 79వదా లేక 80వదా..? కొందరు 79 అంటుంటే మరికొందరు 80 ఇండిపెండెన్స్ డే అంటుండటంతో చాలా మందికి కన్ఫ్యూజన్ ఏర్పడటం కామన్. క్లారిటీ ఏంటో తెలుసుకుందాం.

బ్రిటిష్ పాలన నుంచి ఇండియాకు స్వాతంత్ర్యం 1947, ఆగస్టు 15వ తేదీన వచ్చింది. అప్పటి నుంచి లెక్కిస్తే 2026 ఆగస్టు 15 వరకు 79 సంవత్సరాలు పూర్తవుతుంది. 2026 నుంచి 1947 తీసివేస్తే కూడా 79 అని వస్తుంది.

అయితే ఈ విషయంలో కన్ఫ్యూజన్ కు కారణం.. 1947 నుంచి లెక్కింపుతో ఇయర్స్ ను లెక్కించినట్లు కాదు. కేవలం ఎన్ని సార్లు ఇండిపెండెన్స్ డే చేస్తున్నాము అనే దానికి సరిపోతుంది. ఎందుకంటే.. 1947 ఆగస్టు 15 అనేది స్వాతంత్ర్యం వచ్చిన తేదీ మాత్రమే. ఆ తేదీ ప్రకారం ఏడాది పూర్తి అయినట్లు కాదు. ఈ లెక్కన 1947 నుంచి లెక్కపడితే.. 1947 ఒకటవది. 1948 2వది. ఆ రకంగా 2025 ఏడాదికి 79వ స్వాతంత్ర్య దినోత్సవం అవుతుంది. ఆ తర్వాత 2026 అనేది 80 ఇండిపెండెన్స్ డే అవుతుంది. అంటే వేడుక ప్రకారం.. ఇది ఎన్నో ఇండిపెండెన్స్ అంటే 80 అనేది క్లియర్. మరి 79 ఎలా అనే డౌట్ కూడా రావచ్చు.

**79.. లేక 80..? ఏది కరెక్ట్**

స్వాతంత్ర్యం వచ్చి ఎన్ని సంవత్సరాలు పూర్తయింది అంటే 79 ఏండ్లు అని చెప్పవచ్చు. అలా కాకుండా నెంబర్ ప్రకారం చూసుకుంటే ఇప్పుడు వచ్చే ఇండిపెండెన్స్ డే ఎన్నవది అంటే 80వది అని చెప్పవచ్చు. ఈ లెక్కింపులో వస్తున్న ఒక ఏడాది గ్యాప్ అనేది పూర్తిగా.. ఫస్ట్ ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ ఆధారం చేసుకుని ఆలోచించడం వలనే. సో.. ఈ స్వాతంత్ర్య దినోత్సవం ఎన్నవది అంటే 80.. ఎన్నేళ్లు పూర్తయింది అంటే 79 అని క్లారిటీ ఉంటే చాలు.

# టెసరాక్ట్ కంపెనీకి అప్పనంగా భూమి కేటాయించారు

### చదువురాని రేవంత్ బ్రదర్స్ అందరూ సూట్లు కోట్లు వేసుకుని చైర్మన్లు అయిపోతున్నరు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** పక్క రాష్ట్రం కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్య సతీమణికి.. అక్కడి ప్రభుత్వం మూడెకరాల భూమి కేటాయించిందని బీజేపీ ఫిర్యాదు చేసింది. ఆ వ్యవహారంలో లోకాయుక్త తీర్పు ఇచ్చింది. చివరికి సిద్ధరామయ్య రాజీనామా చేసేదాకా వచ్చిందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

తెలంగాణలో టెసరాక్ట్ అనే కంపెనీకి అప్పనంగా భూమి కేటాయించారు. టెసరాక్ట్ కంపెనీకి రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డి చైర్మన్. ఆ విషయాన్ని కొండల్ రెడ్డే లింక్డ్ ఇన్ ప్రొఫైల్లో పెట్టుకున్నారు. టెసరాక్ట్ కంపెనీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పరికరాలను తయారు చేస్తుందట. అమెరికా ఎంబసీ ప్రతినిధితో హైదరాబాద్లో మీటింగ్ కూడా పెట్టారు. యూఎస్ ఇండియా స్ట్రాటెజిక్ డెవలప్ మెంట్ ఫోరంలో.. ఎగ్జిక్యూటివ్ బోర్డులో కొండల్ రెడ్డికి సభ్యత్వం ఇచ్చారని అన్నారు.

కొండల్ రెడ్డి ఏం చదివారో నాకు తెలియదు. టెసరాక్ట్ కంపెనీకి కొండల్ రెడ్డి చైర్మన్ అని అమెరికా కాన్సులేట్ కూడా స్టేట్ మెంట్ ఇచ్చింది.చదువురాని రేవంత్ బ్రదర్స్ అందరూ సూట్లు కోట్లు వేసుకుని చైర్మన్లు అయిపోతున్నరు. టెసరాక్ట్ కంపెనీ కథ ఏంటని మేం ఆరా తీశాం. ఆ కంపెనీ ఫోన్ నంబర్ 123456789 అట. ఇలాంటి నంబర్లు ఉంటాయని మాకు తెల్వదు. రేవంత్ ఏదైనా కొత్త టెక్నాలజీ కనిపెట్టిండేమో? విచిత్రం ఏంటంటే టెసరాక్ట్ కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేడు. 2025 మార్చి 31 నాడు వాళ్లే ప్రకటన చేశారు. తమ కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేడని చెప్పారు. ఊరూ పేరు లేని చోట ఆ కంపెనీ అడ్రస్ ఉంది. టెసరాక్ట్ మూలధనం లక్ష రూపాయలు. ఈ కంపెనీకి రేవంత్ ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టింది. ఈ కంపెనీకి రేవంత్ ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టింది. ఐదెకరాల భూమిని కేటాయించి, అతిపెద్ద కుంభకోణానికి పాల్పడ్డారు. ఇది అనుముల కొండల్ రెడ్డి వ్యవహారం. అనుముల జగదీష్ రెడ్డి అని రేవంత్కు ఇంకో తమ్ముడు ఉన్నాడు. జగదీష్ రెడ్డి అమెరికాలో ఉంటాడు. రేవంత్ అమెరికా పర్యటనకు పోయినప్పుడు.. వెయ్యి కోట్ల డీల్ చేసుకున్నరు. స్వచ్ఛ్ బయో అనే కంపెనీతో ఒక మెమోరాండం సైన్ చేశారు. వాళ్లకు ఎక్కడ భూములు ఇచ్చారో తవ్వి తీస్తామని అన్నారు.

రేవంత్ బామ్మర్ది సృజన్ రెడ్డికి రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టు దక్కింది. రేవంత్ రెడ్డి, మోడీ ప్రభుత్వం కలిసి నడుపుతున్న సింగరేణిలో.. సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే అంతా నడుస్తోంది. సైట్ విజిటేషన్ సర్టిఫికెట్లు, వేల కోట్ల కుంభకోణాలు అన్నీ బయటపెట్టినం. ఈ పరంపరలో మేం బయటపెట్టిన తాజా కుంభకోణమే టెసరాక్ట్. వడ్డించే వాడే మనోడే అన్నట్టు భూములు కొట్టేశారు. రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని రూ.7 కోట్లకు రాసిచ్చారు. ఇది స్కాం కాదా? పక్క రాష్ట్రం కర్ణాటకలో ఒక న్యాయం, ఇక్కడ ఒక న్యాయమా? టెసరాక్ట్ కథేంటో తేల్చేదాకా వదిలిపెట్టం. ఆ కంపెనీకి, ముఖ్యమంత్రి సోదరుడికి ఏ సంబంధం లేదని శ్రీధర్ బాబు అంటున్నడు. చైర్మన్ అనుముల కొండల్ రెడ్డి అని వాళ్లే ప్రొఫైల్లో రాసుకున్నరు. కానీ మంత్రి శ్రీధర్ బాబు సిగ్గులేకుండా బుకాయిస్తున్నరు. అసలు ఇవన్నీ మంత్రికి తెలిసి జరుగుతున్నాయా? మీ శాఖలో ఏం జరుగుతుందో మీకు తెలుస్తుందా శ్రీధర్ బాబు గారు? ఈ భూకేటాయింపుల కుంభకోణంలో ఎవరినీ వదిలిపెట్టం. ముఖ్యమంత్రి సోదరులైతే ఏమైనా చేయొచ్చా? సీఎం అన్న తిరుపతి రెడ్డికి ఏ అధికారిక హోదా ఉంది? కలెక్టర్లు, ఎస్పీలు ఆయనకు వంగివంగి దండాలు పెడుతున్నరని అన్నారు.

# అంతర్ జిల్లాల బదిలీల ప్రక్రియ ఆగమాగం..

**హైదరాబాద్ పెన్ పవర్:** వరంగల్ గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం స్టాంప్ల రిజిస్ట్రేషన్ల శాఖలు చేపట్టిన అంతర్ జిల్లాల బదిలీల ప్రక్రియ పూర్తిగా విఫలమైందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతి పెరిగిపోయిందని , దాన్ని పూర్తిగా తగ్గించి పనితీరును మెరుగుపరిచి నాణ్యమైన సేవలను ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన అంతర్ జిల్లాల బదిలీల వ్యవహారం క్షేత్రస్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదని సంబంధిత శాఖలో విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల అనంతరం గత రెండు సంవత్సరాల క్రితం రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ వ్యాప్తంగా ఏ శాఖలో లేని విధంగా రిజిస్ట్రేషన్ శాఖలోనే ఈ విధానాన్ని ప్రభుత్వ అమలు జరిపింది. దాంతో వరంగల్ జిల్లాలో పనిచేసిన సబ్ రిజిస్టర్ , సీనియర్ అసిస్టెంట్ స్థాయిలలో పనిచేసిన ఉద్యోగులను ఖమ్మం తో పాటు ఇతర జిల్లాలకు బదిలీ చేసింది.ఇతర జిల్లాల వాళ్లను వరంగల్ కు తీసుకురావడం వల్ల కార్యాలయాలలో అవినీతి వ్యవహారాలు ఆగిపోతాయని ప్రభుత్వం భావించింది. ముఖ్యంగా జిల్లాలు మారడంతో ప్రజలుతో పరిచయాలు ఏర్పడడానికి కొంతకాలం పడుతుందని దాంతో అధికారులు భయపడి అవినీతి పనులకు దూరంగా ఉండే పరిస్థితి ఉంటుందని ప్రభుత్వం భావించింది. ఆయా జిల్లాలకు బదిలీలపై వెళ్లే అధికారులు ఆ జిల్లా వాతావరణాన్ని , రాజకీయ పరిస్థితులను , ప్రజల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉండడంతో ప్రభుత్వం ఈ ప్రక్రియకు ముందుకు వచ్చినట్లుగా కొంతమంది అధికారులు అంటున్నారు. అయినప్పటికీ వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఏమాత్రం అవినీతి తగ్గలేదని జిల్లా ప్రజలు భావిస్తున్నట్లు ప్రచారం సాగుతుంది .

**రిజిస్ట్రేషన్ శాఖలో ఆగమాగం.**

ప్రభుత్వంలోని ఏ శాఖలో లేనివిధంగా రిజిస్ట్రేషన్ శాఖలో అంతర్ జిల్లాల బదిలీల ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి అమలు జరిపింది. ఈ విధానం ప్రభుత్వం ఆశించిన రీతిలో క్షేత్రస్థాయిలో పనిచేయకపోవడమే గాక ప్రజల్లో తీవ్రమైన విమర్శలకు దారితీసింది అన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విధానం వల్ల రిజిస్ట్రేషన్ శాఖ పూర్తిగా ఎన్నడూ లేని విధంగా దెబ్బతిన్నని అంటున్నారు. ఉద్యోగుల మధ్యన సమన్వయం లేక తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటుందని కొంతమంది అధికారులు బాహాటంగా విమర్శిస్తున్నారు. జిల్లాలో పూర్తిస్థాయిలో సబ్ రిజిస్టర్ లు లేకపోవడం వలన ప్రజలు కార్యాలయాలలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారూ. సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో సిబ్బంది కొరత ప్రజలను ఇటు అధికారులను తీవ్ర మనోవేదనకు గురి చేస్తుందంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం సబ రిజిస్టర్ కార్యాలయాలలో సరిపడే విధంగా ఖాళీలను భర్తీ చేసి పనితీరు మెరుగుపరిచే విధంగా చూడాలని ప్రజల భావిస్తున్నారు. ఒకే కార్యాలయంలో కలిసి పని చేస్తున్నప్పటికీ జిల్లాల వారీగా విభేదాలు ఫోడచూపిన సంఘటనలు ఉన్నట్లు తెలిసింది.

**అవినీతి పెరిగింది**

వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాలు గతంలో ఎన్నడు లేని విధంగా అవినీతి పెరిగింది కానీ తగ్గుముఖం పట్టిన ఆనవాళ్లు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. గడిచిన రెండు సంవత్సరాల కాలంలో

కార్యాలయాలలో అవినీతి పెరిగింది అనడానికి ఏసీబీ జరిపిన దాడులలో కొందరు అవినీతి అధికారులు దొరికిన ఉదంతాలు నిదర్శనంగా మిగిలాయి. జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయం కింద ఉన్న హన్మకొండ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు సభ్యులు ఏసీబీ జరిపిన దాడుల్లో ఇద్దరు సబ్ రిజిస్టర్లు దొరికిపోవడం జిల్లా వ్యాప్తంగా సంచలనం కలిగించింది. స్టేషన్ఘన్పూర్ లో పనిచేసిన సబ్ రిజిస్టర్ ఏసీబీ దాడుల్లో దొరికిపోయిన విషయం తెలిసిందే. కార్యాలయాలలో అవినీతి పెరిగిపోయింది అన్న ఉద్దేశంతో ఏసీబీ అధికారులు జిల్లాలోని కొన్ని కార్యాలయాలలో ఆకస్మికంగా జరిపిన దాడులు జిల్లా ప్రజలను కలవరపాడు గురి చేశాయి.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో అధిక లాభాలు



పెసర పంటను పరిశీలిస్తున్న ఏవో రామారావు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 11:** ఎల్ ని నో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో మార్పులు చేసుకొని వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టి అధిక లాభాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని బుద్దారం గ్రామంలో ఆయిల్ పామ్ అంతర పంట గా సాగు చేసిన పెసర లో మంగళవారం రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేపట్టి రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితి లో సాగు చేయవలసిన ప్రత్యామ్నాయ పంటల సాగు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశించిన స్థాయి లో వర్ష పాతం నమోదు కానందున రైతులు వరి కి బదులుగా ప్రత్యామ్నాయ పంట లైన పప్పు దినుసులు కూరగాయలు జొన్న లు మొక్కజొన్న వేరుశనగ చిరు ధాన్యాల వంటి తక్కువ నీటి వినియోగం తో ఎక్కువ దిగుబడి నిచ్చే ఆరుతడి పంటల సాగు శ్రేయస్కరం అని అదేవిధంగా కొద్దిపాటి నీటి నిల్వలకు నీటి కుంటలు ఏర్పాటు చేసుకొని వాన నీటిని నిల్వ చేసుకొని బూగర్భ జలాలను పెంచుకోవాలని కోరారు.ఎల్ నినో ప్రభావం తో దీర్ఘకాలిక పంటల చివరి వరకు నీరు సరిపోక ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నదని పప్పు దినుసుల సాగుతో బూసారం పెరుగుతుందని కూరగాయలు ఆరు తడి పంటల సాగు తో ఆహార భద్రత కు భరోసా లభిస్తుందన్నారు వర్షభావ పరిస్థితి లో నీటి కొరత ను అదిగమించేందుకు పంట కుంటల నిర్మాణం చేపట్టడానికి ముందుకు రావాలని రైతులను ఆయన కోరారు.

# బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ


నివాళులర్పిస్తున్న వడ్లమూడి దుర్గాప్రసాద్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 11:** గార్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంధసిరి వీరన్న తల్లి గంధసిరి పుల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందగా ఈ విషయం తెలుసుకున్న గార్ల పిఎసిఎస్ సింగిల్ విండో చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ మంగళవారం దమ్మాయిగూడెంలోని ఆమె స్వగ్రామానికి వెళ్లారు.

ఈ సందర్భంగా పుల్లమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పుల్లమ్మ మృతి పట్ల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట శ్రీనివాస్, పాల్తీయా కిషన్, లెనిన్, పళ్ళ నరసయ్య, కత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొని పుల్లమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు.

# సూపరింటెండెంట్‌కు ఘన సన్మానం

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 11:**

గార్ల మండల కేంద్రంలోని స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నాగేశ్వరరావును మంగళవారం ఆసుపత్రి సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా సేవలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి సిబ్బంది సహకారం ఎంతో అవసరమని, అందరి సహకారంతో గార్ల సీహెచ్‌సీకి మరింత మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది

సీనియర్ అసిస్టెంట్ కిషోర్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ వి స్వాతి, మెర్సీ ఝాన్సీ రాణి, ఐ రాణి ,నర్సింగ్ ఆఫీసర్స్ వినీల, రజిని, పారామెడికల్ సిబ్బంది అశోక్ ,మాధవి, బైరపాక శ్రీనివాస్, పర్వీన్, నరసయ్య, తిరుమల రావు, నరేష్. తదితరులు పాల్గొన్నారు.


నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

# సిపిఎం పోరాటాల ఫలితమే వైద్యుల కేటాయింపు


వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు (ఫైల్)

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 11:** మహబూబాబాద్ జిల్లా గార్లలో అన్ని వసతులతో ఉన్న 30 పడకల ఆసుపత్రిలో అదనపు వైద్యులను నియమించాలని సిపిఎం పార్టీ, అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దశలవారీగా నిర్వహించిన పోరాటాల ఫలితశీగా మంగళవారం ఐదుగురు వైద్యులను హాస్పిటళ్లకు కేటాయించడం హర్షినియమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా డిసి హెచ్ ఎస్ డాక్టర్ చింత రమేష్ మంగళవారం హాస్పిటల్ కి వచ్చి నూతనంగా డాక్టర్ కె.నాగేశ్వరరావు, జనరల్ సర్జన్, డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి, పిల్లల వైద్యులు డాక్టర్ మౌనిక, గైనకాలజిస్ట్, స్త్రీల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ మనిష, మత్తు డాక్టర్ వైశాలి రెడ్డి, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ లతో కూడిన

ఐదుగురు వైద్యులను నియమించారు. సిపిఎం ఆందోళన ఫలితంగా స్పందించి వైద్యులను నియమించిన జిల్లా కలెక్టర్ కు, జిల్లా వైద్య అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే కు సిపిఎం మండల కమిటీ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

## రహదారిపై గుంతలు పూడ్చిన పోలీసులు


గుంతను పూడ్చివేసిన పోలీసులు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 11:** గార్ల మండల కేంద్రంలోని డోర్నకల్ వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతను మంగళవారం పోలీసులు పూడ్చివేయించి వాహనదారులకు భద్రత కల్పించారు. రహదారిపై పెద్ద గుంత ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించిన పోలీసులు వెంటనే స్పందించారు.గుంతను పూడ్చివేయడంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులకు కొంత ఊరట లభించింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంత కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉండటంతో ఎలాంటి ప్రమాదాలుజరగకుండారోడ్డు భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదకర గుంతను పూడ్చివేయించడం పట్ల ప్రజలు వాహనదారులు శభాష్ పోలీస్ అంటూ ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గార్ల బయ్యారం సీఐ రవీందర్ ఎస్సై సాయికుమార్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ పార్టీని ఆక్రమించడమే లక్ష్యంగా బీజేపీ

**వరంగల్ ఆగస్టు 11, పెన్ పవర్:** తెలంగాణలో సంచలనాలు సృష్టించేందుకు బీజేపీ పదునైన వ్యూహానికి పదును పెట్టింది. ఢిల్లీ వేదికగా జరిగిన ఒక కీలక ఉన్నత స్థాయి భేటీలో, తెలంగాణ కమలనాథులకు పార్టీ అధిష్ఠానం అత్యంతస్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. పదేళ్ల పాటు అధికారంలో ఉండి, విపక్షంలోకి వెళ్లాక తీవ్రమైన సవాళ్లతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీని సంపూర్ణంగా ఆక్రమించడమే లక్ష్యంగా బీజేపీ అడుగులువేస్తోంది. గులాబీ పార్టీ నైతిక ధైర్యం దెబ్బతీసి, తెలంగాణలో ఇకపై కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మధ్యనే పోరాటం సాగాలని దిశానిర్దేశం చేసింది. ఈ మేరకు పార్టీ కేడర్ పనిచేయాలని స్పష్టం చేసింది.ప్రధాన ప్రతిపక్షపాత్ర పోషించడంలో బీఆర్ఎస్ ఎక్కడైతే వెనకబడుతోందో, ఆ ప్రతికూలతనే తమ రాజకీయ అవకాశంగా మలుచుకోవాలని బీజేపీ యోచిస్తోంది. ప్రజాపోరాటాల్లో బీఆర్ఎస్‌కు ఎలాంటి మైలేజ్ దక్కకుండా చెక్‌పెడుతూ, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక నిజమైన విపక్షం తమదేనని నిరూపించుకోవాలని భావిస్తోంది. విద్యార్థులు, రైతులు, చేతివృత్తుల వర్గాలు ఎదుర్కొంటున్నసమస్యలతో పాటు, ఆరు గ్యారెంటీలు, రైతు రుణాలు, నిరుద్యోగ భృతి, మహిళా పథకాల అమలులో క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతున్న అసంతృప్తిని క్షేత్రస్థాయి ఆందోళనల ద్వారా ఆయుధంగా మలచుకోవాలని అధిష్ఠానం పిలుపునిచ్చింది. కాంగ్రెస్ హామీలు ఉత్తుత్తివేనని, ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమ మోడల్ మాత్రమే శాశ్వతమని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రధాన్ ఎజెండాకొంతకాలంగా తెలంగాణ బీజేపీని వేధిస్తున్న అంతర్గత విభేదాలపై కేంద్ర నాయకత్వం సీరియస్ క్లాస్ తీసుకుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కమిటీ సభ్యులు తమ వ్యక్తిగత ప్రయోజనాలు, వ్యాఖ్యలను పక్కనబెట్టి ఒకే టీమ్‌గా పనిచేయాలని స్పష్టం చేసింది. ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేసుకుంటే ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పిన నేతలు, సమష్టి నాయకత్వంతో పోరాడితేనే 2028లో అధికార పీఠం సాధ్యమవుతుందని మార్గదర్శనం చేశారు.కేవలం అర్బన్ ఏరియాలకే పరిమితం కాకుండా గ్రామ పంచాయతీల నుంచి పార్టీ నెట్‌వర్క్‌ను బలపరచాలని ఆదేశించారు. త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను సెమీఫైనల్స్‌గా భావించి సమరశంఖం పూరించనున్నారు. మత ఆధారిత రిజర్వేషన్లు, ముస్లిం ఓటు బ్యాంక్ రాజకీయంపై కాంగ్రెస్‌ను నిలదీస్తూనే, సనాతన ధర్మ పరిరక్షణను ఎజెండాగా మార్చుకోవాలని సూచించారు. అదే సమయంలో కేంద్రం నుంచి తెలంగాణకు అందిన ఎయిమ్స్, కాజీపేట వ్యాగన్ తయారీ యూనిట్, ఎలివేటెడ్ కారిడార్లు, జాతీయ రహదారుల నిధుల వివరాలను గడపగడపకూ చేరవేయనున్నారు.ఈ ఢిల్లీ భేటీతో తెలంగాణలో బీజేపీ వ్యూహం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. బీఆర్ఎస్‌ను గతంగానూ, కాంగ్రెస్‌ను వైఫల్యంగానూ చిత్రీకరిస్తూ.. బీజేపీ మాత్రమే రాష్ట్ర భవిష్యత్తు అనే నరేటివ్‌ను బలంగా తీసుకెళ్లాలని కమల దళం యుద్ధానికి సిద్ధమవుతోంది.

# 2028 గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్

**హైదరాబాద్ ఆగస్టు 11 పెన్ పవర్:** 2028 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో మళ్లీ అధికారంలోకి రావడమే ఏకైక లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సరికొత్త సంస్థాగత వ్యూహానికి తెరలేపింది. సాధారణంగా కేడర్‌కు ఇచ్చే పార్టీ పదవులనుఈసారి నేరుగా గెలిచిన ప్రజాప్రతినిధులకే కట్టబెడుతోంది. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే వ్యక్తం చేస్తున్న ధీమావెనుక ఈ పక్కా సంస్థాగత ప్రణాళికే కారణమని తెలుస్తోంది.కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ప్రక్షాళన ప్రక్రియను పార్టీ అధిష్టానం ఏడాది కిందటే ప్రారంభించింది. జనవరి 2024లో ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీగాఎన్నికైన బి. మహేష్ కుమార్ గౌడ్‌కు సెప్టెంబర్ 2024లో టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత కీలక పదవుల్లో ప్రజాప్రతినిధులకు పెద్దపీట వేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులుగా నల్గొండఎంపీ కె.రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయని రాజేందర్ రెడ్డి, సి.వంశీకృష్ణలకు కట్టబెట్టింది. అలాగే టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుదా ఎమ్మెల్యేలు వేద్మ బొజ్జు, డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డి, డాక్టర్ మట్ట రాగమయిలను నియమించింది..పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్ష పదవులను కూడా ప్రజాప్రతినిధులకే కేటాయించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకరయ్యను టీపీసీసీ ఓబీసీ సెల్ ఛైర్మన్‌గా, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఎస్సీ సెల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను ఎస్టీ సెల్ అధిపతిగా నియమించారు.నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవికి టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ బాధ్యతలు వహించారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డి పేరునుపరిశీలించినప్పటికీ, వ్యక్తిగత కారణాలతో ఆమె తిరస్కరించడంతో వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను ఆ పదవిలో నియమించారు.ఇటీవల భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని టీపీసీసీమీడియా కమిటీ ఛైర్మన్‌గా నియమించగా, జిల్లా స్థాయిలోనూ ఐదుగురు ఎమ్మెల్యేలను డీసీసీ అధ్యక్షులుగా నియమించారు. వారిలో బీర్ల ఐలయ్య, మేడిపల్లి సత్యం, చిక్కుడు వంశీకృష్ణ, వేద్మ బొజ్జు ,ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఉన్నారు.ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు పార్టీ బాధ్యతలు ఇవ్వడం వెనుక ఉన్న సామాజిక, రాజకీయ కారణాలను టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డిస్పష్టం చేశారు. ప్రతిపక్షాల విమర్శలను, ఆరోపణలను బలంగా ఎదుర్కోవాలంటే అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు ముందుకు రావడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. పవర్ ఉన్న నేతలుకౌంటర్ ఇచ్చినప్పుడే దానికి ప్రాధాన్యత, విలువ ఉంటాయి. పదవులతో పాటు జవాబుదారీతనం, బాధ్యత పెరుగుతాయి. ఇది క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందనేది కాంగ్రెస్ పార్టీ ఆలోచనగా ఉంది.పార్టీ అధిష్టానం త్వరలోనే ఎంపీలు లేదా ఎమ్మెల్యేల నుంచి కనీసం ఇద్దరిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమించే ఆలోచనలో ఉంది. ప్రస్తుతం కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి,మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేర్లు ఈ రేసులో బలంగా వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో కేవలం పార్టీ పదవులే కాకుండా, ప్రభుత్వం తరఫున ఇచ్చే పలు కీలక నామినేటెడ్ పోస్టులను కూడాఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పగించి, పార్టీ సంస్థాగత పునాదులను రాష్ట్రవ్యాప్తంగా మరింత పటిష్టం చేయాలనేది కాంగ్రెస్ ప్రణాళిక.

# తెలంగాణలో సర్వేల గుబులు.. రెండేళ్లకు ముందేనా

**హైదరాబాద్, ఆగస్టు 11, పెన్ పవర్:** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ప్రధాన పార్టీలయిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లు ఇప్పటి నుంచే ప్రైవేట్ సంస్థల ద్వారా సర్వేలు నిర్వహిస్తుండటంతో అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో టెన్షన్ నెలకొంది. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై వస్తున్న రహస్య సర్వే నివేదికలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. దీంతో అధికార పార్టీలో కలవరం రేగుతుంది. అదే సమయంలోఈ సర్వేల్లో నిజమెంత? అబద్ధమెంత? అన్నది మాత్రం తెలియడం లేదు. తెలంగాణలో ఎన్నికలు జరగడానికి ఇంకా రెండేళ్లు సమయం ఉంది. జమిలీ ఎన్నికలు జరిగితే మూడేళ్ల తర్వాత కాని తెలంగాణలోఎన్నికలు జరగవు... కానీ ముందే అనేక ప్రయివేటు సంస్థలు సర్వేలు నిర్వహిస్తు రాజకీయ పార్టీల్లో గుబులు రేపుతున్నాయి. అయితే ఇవి పెయిడ్ సర్వేలని తమకు అనుకూలంగా రాని పార్టీలుకొట్టిపారేస్తున్నా... ఎక్కడో ఏదో అనుమానం. ప్రజల్లో నిజంగా అసంతృప్తి ఉందా? అని అధికార పార్టీ, ప్రజల్లో తమ పార్టీకి అనుకూలత లేదా? అని విపక్ష పార్టీలు ఆందోళనలో పడ్డాయి. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, హామీల అమలు తీరుపై ప్రజల నుంచి వస్తున్న స్పందనను అంచనా వేయడానికి పార్టీలు సర్వేలు చేపట్టాయి.నియోజకవర్గాల్లో నిధుల కొరత, ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్నకొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరు ఆశించదగ్గ రీతిలో లేదని సర్వేల్లో వస్తున్న టాక్ గుబులు పుట్టిస్తోంది.. భవిష్యత్తులో టికెట్ల కేటాయింపునకు ఈ సర్వేలనే ప్రామాణికంగా తీసుకుంటారనేప్రచారం నాయకుల్లో ఆందోళన కలిగిస్తోంది.రాజకీయ పార్టీల వ్యూహాలుఅధికార కాంగ్రెస్ పార్టీ తరఫున అంతర్గత సర్వేల ద్వారా ప్రజాభిప్రాయాన్ని బేరీజు వేస్తుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ , బీజేపీ కూడా గ్రౌండ్‌రియాలిటీపై దృష్టి పెట్టాయి.ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాలు, ప్రజా స్పందన ఆధారంగా పార్టీల వ్యూహాలను మారుస్తున్నాయి. తమకు సానుకూలత, అననుకూలత ఏ నియోజకవర్గాల్లోఅంచనా వేసుకుని వాటిని దిద్దుకునే ప్రయత్నంలో ఉన్నాయి. మొత్తం మీద రెండేళ్ల ముందే సర్వేలు తెలంగాణ రాజకీయ పార్టీల్లో కాక రేపుతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

# రీల్ టీచర్స్....

**ఖమ్మం, ఆగస్టు 11, పెన్ పవర్:**
ఆమె పేరు గౌతమి రాథోడ్. పేరుకు తగ్గట్టుగానే అందంగా ఉంటుంది. గొంతు కూడా శ్రావ్యంగా ఉంటుంది. పైగా గవర్నమెంట్ టీచర్. రీల్స్ చేయడం ఆమె చాలా ఇంట్రెస్ట్. తాను పనిచేస్తున్న స్కూల్లో రీల్స్‌చేసేది.రీల్స్ ద్వారా ఆమె సోషల్ మీడియాలో విపరీతంగా పాపులారిటీ సంపాదించుకుంది. సెలబ్రిటీ అయిపోయింది. అనుసరించే వారు కూడా భారీగా ఉండటంతో ఆమె రేంజ్ పెరిగిపోయింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. వచ్చిన ఫేమ్ ద్వారా ఆమె కొన్ని ప్రవేట్ సంస్థలకు ప్రచారం చేస్తున్నట్టు విద్యాశాఖకు ఫిర్యాదులు అందాయి. దీంతో విద్యాశాఖ అధికారులు రంగంలోకి దిగారు. విచారణ నిర్వహించారు.ఆమెను సస్పెండ్ చేశారు.ఇటీవల ఆమెకు పోస్టు లభించింది. విధుల్లోకి వెళ్లాల్సిన ఆమె సోషల్ మీడియా ద్వారా ఒక వీడియో రిలీజ్ చేశారు. తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆమెనిర్ణయం ఒక రకంగా సంచలనం కలిగించింది. ఆమె రీల్స్ చేస్తున్నప్పుడు తోటి ఉద్యోగులు హేళనకు గురిచేసారట. ఆమెను ఇబ్బంది పెట్టారట. తట్టుకోలేక కష్టపడి సాధించిన ఉద్యోగాన్ని వదులుకున్నాననిగౌతమి సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేసింది. తాను స్కూల్లో.. విద్యార్థులకు పాఠాలు చెప్పే సమయంలో ఎటువంటి రీల్స్ చేయలేదని ఆమె స్పష్టం చేసింది. ఒకవేళ తాను అలా రీల్స్ చేసిఉంటే విద్యార్థులు లేదా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు తనమీద ఫిర్యాదు చేసి ఉండేవారు కదా అంటూ ఆమె ప్రశ్నించారు.అప్పట్లో గౌతమి మీద విద్యాశాఖ సస్పెన్షన్ వేటు వేసినప్పుడు.. దానినితొలగించాలని ఆమె ఏకంగా ఆరు నెలల పాటు విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరిగింది. చైతన్య జై ని ఆమెను కనీసం పట్టించుకోలేదు. తనను మనిషిలా కూడా చూడలేదని గౌతమి తన సెల్ఫీ వీడియోలో వాపోయింది. ఒక దశలో చైతన్య ఆమెను ఉద్దేశించి నువ్వు నా దగ్గరికి రావద్దు.. వెళ్లిపో అంటూ గట్టిగా కేకలు వేశారని గౌతమి సోషల్ మీడియాలో వాపోయింది. తన మీద ఆరు నెలలపాటు సస్పెన్షన్ వేటి వేసినప్పుడు తోటి ఉపాధ్యాయులు.. ఉపాధ్యాయ సంఘాలు కనీసం అండగా నిలబడలేదని గౌతమి వాపోయింది.సరిగ్గా 6 నెలల క్రితం గౌతమి గురించి తెలంగాణ వ్యాప్తంగా చర్చ నడిచింది. రీల్స్ టీచర్గా ఆమె పేరు పొందింది. అయితే వచ్చిన పేరును ఆమె ఒక ప్రైవేట్ సంస్థ ప్రమోషన్ కోసం ఉపయోగించుకుంది. అందువల్ల విద్యాశాఖ అధికారులు ఆమె వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుపట్టారు.అంతేకాదు ఆమెను సస్పెన్షన్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో ఈయన వ్యవహారం తెలంగాణ వ్యాప్తంగా సంచలనంగా మారింది. చివరికి ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

### 71 లక్షల మంది ఓట్ల తొలగింపు..

# ముగిసిన ఎస్ఐఆర్ డెడ్‌లైన్.. తుది జాబితాపై తీవ్ర ఉత్కంఠ!

**హైదరాబాద్, ఆగస్టు 11, పెన్ పవర్:** తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలోని 3.38 కోట్ల మంది ఓటర్లలో దాదాపు 71 లక్షల మంది ఓటర్లు అన్‌కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగానికి పైగా హైదరాబాద్,మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉన్నట్లు వెల్లడైంది. ఇక నేటితో ఎస్ఐఆర్ గడువు ముగియడంతో ఇప్పుడు ఫారాల పరిశీలన, ధ్రువీకరణ అనంతరం తుది ఓటర్ల జాబితా ఎలా ఉండబోతోందన్న దానిపై సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు ఇచ్చిన గడువు ముగిసింది. దీంతో రాష్ట్రంలో దాదాపు 71 లక్షల మంది ఓటర్ల వివరాలపై ఇప్పుడు తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ ఓటర్లను అన్‌కలెక్టబుల్ కేటగిరీలో గుర్తించిన నేపథ్యంలో.. తుది ఓటర్ల జాబితాలో వీరి పేర్లు కొనసాగుతాయా లేక తొలగిస్తారా అనేది కీలకంగా మారింది. తెలంగాణలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. సుమారు 70.8 లక్షల మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని లేదా సేకరించలేని కేటగిరీలో ఉన్నట్లు తాజా గణాంకాలు వెల్లడించాయి.ఈ సంఖ్య రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో దాదాపు 21 శాతానికి సమానమని ఎన్నికల సంఘం గణాంకాలు పేర్కొంటున్నాయి. వీరిలో సుమారు 9.1 లక్షల మంది మరణించినవారు ఉండగా.. 10.3 లక్షల మంది గైర్హాజరు లేదా ఆచూకీ లభించని వారిగా గుర్తించారు. మరో 43 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్లు.. 6.6 లక్షల మంది డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.ఇప్పటికే అన్‌కలెక్టబుల్ కేటగిరీలోకి వచ్చే ఓటర్ల పేర్లను తొలగించే ప్రక్రియ ఉంటుందని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సీ. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే గడువు ముగియగా.. ప్రక్రియ పూర్తి అయ్యే సమయానికి మరిన్ని ఎన్యుమరేషన్ ఫారాలు అందే అవకాశం ఉండటంతో తుది తొలగింపు సంఖ్యలో మార్పు రావచ్చని భావిస్తున్నారు. ఆగస్ట్ 9వ తేదీ నాటికి సుమారు 3.2 లక్షల ఫారాలు మాత్రమే డిజిటలైజ్ కావాల్సి ఉండగా.. మిగిలిన ప్రక్రియను అధికారులు పూర్తి చేయనున్నారు.ఎస్ఐఆర్‌లో అత్యధికంగా అన్‌కలెక్టబుల్ ఫారాలు నమోదైన ప్రాంతంగా గ్రేటర్ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం నిలిచింది. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాలు కలిపి సుమారు 41.5 లక్షల అన్‌కలెక్టబుల్ ఫారాలు నమోదు అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 70.8 లక్షలతో పోలిస్తే ఇవి దాదాపు 58.6 శాతానికి సమానం.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల వివరాలను సేకరించడంలో అనేక ఇబ్బందులు ఎదురైనట్లు తెలుస్తోంది. అద్దె ఇళ్లలో ఉండేవారు తరచూ ఇళ్లను మార్చడం.. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం.. మూసివేసిన ఇళ్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఓటర్లను గుర్తించడం కష్టంగా ఉండటం, మరణించిన ఓటర్ల పేర్లు కొనసాగడం వంటి కారణాలు అన్‌కలెక్టబుల్ కేసులు పెరగడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.మరోవైపు ఉత్తర, పశ్చిమ తెలంగాణలో ఓటర్ల వివరాల్లో అనామలీస్ (వివరాల్లో తేడా ఉండటం) శాతం ఎక్కువగా నమోదైంది. జిల్లా స్థాయిలో ఆదిలాబాద్‌లో 28.5 శాతం ఓటర్ల వివరాల్లో అనామలీస్ గుర్తించారు. నిజామాబాద్‌లో 27.4 శాతం, నిర్మల్‌లో 26.1 శాతం, మెదక్‌లో 24.6 శాతం, కామారెడ్డిలో 23.9 శాతం, సంగారెడ్డిలో 23.8 శాతం నమోదు అయ్యాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే ఆదిలాబాద్‌లో 30.4 శాతం అనామలీస్‌తో అత్యధికంగా ఉండగా.. నారాయణఖేడ్‌లో 29.3 శాతం, నిజామాబాద్ అర్బన్‌లో 28.4 శాతం, షాద్‌నగర్‌లో 28.3 శాతం, నిర్మల్‌లో 28.29 శాతం, నిజామాబాద్ రూరల్‌లో 28.1 శాతం నమోదయ్యాయి.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు సుమారు 2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేసి.. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ధ్రువీకరించినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో 78.1 శాతానికి సమానం. ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు గడువు ముగియడంతో ఇప్పుడు అధికారుల తదుపరి చర్యలపై దృష్టి నెలకొంది. ఇప్పటికే అందిన ఫారాల పరిశీలన, డేటా ధ్రువీకరణ, అభ్యంతరాలు-దరఖాస్తుల పరిశీలన వంటి ప్రక్రియల తర్వాతే తుది ఓటర్ల జాబితాలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నది స్పష్టమవుతుంది.మరీ ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో భారీగా అన్‌కలెక్టబుల్ కేసులు.. ఉత్తర-పశ్చిమ తెలంగాణలో అధిక అనామలీస్ నమోదైన నేపథ్యంలో.. ఎస్ఐఆర్ తుది ఫలితాలు రాష్ట్ర ఓటర్ల జాబితాపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని అర్థమవుతోంది. ప్రస్తుతం 71 లక్షలుగా ఉన్న అన్‌కలెక్టబుల్ ఓటర్ల సంఖ్యలో చివరకు ఎంతమంది పేర్లు తొలగింపునకు గురవుతాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

# హైదరాబాద్ ట్రాఫిక్, అధిక ఉష్ణోగ్రతలు.. ఏటా 200 గంటలు నష్టపోతున్న నగరవాసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌వాసులకు ట్రాఫిక్ రద్దీ, పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు కొత్త సమస్యగా మా రాయి. తాజా అధ్యయనాల ప్రకారం హైదరాబాద్ నగర ప్రజలు ఈ రెండు సమస్యలతో ఏటా 200 గంటలునష్టపోతున్నారని తేలింది. ట్రాఫిక్ కారణంగా ఏడాదికి సుమారు 123 గంటలు కోల్పోతుం డగా.. రాత్రి అధిక ఉష్ణోగ్రతల కారణంగా మరో 75 గంటల నిద్రను కోల్పోతున్నారని వెల్లడైంది. ఇక హైదరాబాద్‌లోట్రాఫిక్ రద్దీ స్థాయి 55.5 శాతంగా ఉన్నట్లు తేల్చింది. వాహనాల పెరు గుదల, రహదారుల కొరత, ప్రజా రవాణా సామర్థ్యం, వాతావర ణ మార్పులు ఈ సమస్యలకు ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.హైదరాబాద్‌లో జీవనం రోజురోజుకూ వేగంగా మారుతున్నా.. నగరవాసులు మాత్రం భారీగా సమయాన్ని నష్టపోతున్నారు. ఒకవైపు రోడ్లపై పెరుగుతున్న ట్రాఫిక్ గంటల కొద్దీ సమయాన్నిమింగేస్తుండగా.. మరోవైపు రాత్రివేళ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు నగరవాసులకు నిద్రను దూరం చేస్తున్నాయి. తాజా అధ్యయనాల ప్రకారం హైదరాబాద్‌వాసులు ట్రాఫిక్ రద్దీ, వేడి రాత్రుల కారణంగా ఏడాదికిదాదాపు 200 గంటల సమయాన్ని కోల్పోతున్నారని వెల్లడైంది. అంటే ప్రతీ సంవత్సరం 8 రోజులకు పైగా సమయం హైదరాబాద్ నగర జీవన పరిస్థితుల కారణంగా వృథా అవుతున్నట్టేనని తేలింది.టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ తాజా రిపోర్ట్ ప్రకారం హైదరాబాద్‌లో ప్రయాణికులు తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ కారణంగా ఏడాదికి సుమారు 123 గంటలు కోల్పోతున్నారని తేలింది. ఇది 5 రోజులకుసమానం. నగరంలో ట్రాఫిక్ రద్దీ స్థాయి 55.5 శాతంగా నమోదైంది. సాధారణంగా 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి సగటున 32.37 నిమిషాలు పడుతుండగా.. సాయంత్రం రద్దీ వేళల్లోపరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. అదే 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 39.5 నిమిషాలు పడుతున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# కాటా ఆమ్రపాలి.. స్మితా సబర్వాల్..

## పోస్టింగ్ కోసం తిప్పలు

**హైదరాబాద్, ఆగస్టు 11, పెన్ పవర్:** కాటా ఆమ్రపాలి.. స్మితా సబర్వాల్.. మహిళా ఐఏఎస్ అధికారులు. వీరిద్దరిలో దూకుడు ఎక్కువ. డైనమిక్ గా పనిచేసే తీరు ఎక్కువ. పైగా వీరిని సూపర్ స్టార్ ఐఏఎస్ అధికారులు అని పిలిచేవారు. వార్తల్లో కూడా ఎక్కువగా కనిపించేవారు.అందానికి అందం.. పని తీరుకు పని తీరు.. ఫలితంగా వీరిద్దరూ మీడియాలో నిత్యం కనిపించేవారు. ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయా లలో పనిచేసే తమ సమర్ధతను నిరూపించుకున్నారు. మీడియా వీరిద్దరి గురించి ఎక్కువగా వార్తలు రాస్తూ ఉండేది. సోషల్ మీడియాలో ఈ ఇద్దరు అధికారులు ఎక్కువగా యాక్టివ్ గా ఉండేవారు. విపరీతమైన ఫ్యాన్ బేస్ ఉన్న ఈ అధికారులకు పోస్టింగ్ ఎందుకు లభించలేదు.. గ్రాఫ్ ఎందుకు తగ్గిపోయింది.. రాజకీయ సమీకరణాలు.. ఇతర అంశాలు వీరికి ఇబ్బందికరంగా మారాయా..ఆమ్రపాలి తనకు పోస్టింగ్ కేటాయించే విషయంలో న్యాయపోరాటం చేసింది. అందులో గెలిచింది. ఈమెకు డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ కేటాయింపులలో ఏపీ క్యాడర్ లభించింది. ఈమెకు మొదటి నుంచి కూడా తెలంగాణ రాష్ట్రంలో పనిచేయాలనేది బలమైన ఆకాంక్ష. అనేక రకాలుగా పోరాటాలు చేసినప్పటికీ ఈమె ఏపీ క్యాడర్లో పనిచేయాల్సి వచ్చింది. సరైన ప్రాధాన్యం లభించకపోవడంతో వరుసగా సెలవులు తీసుకున్నారు. ఆ తర్వాత ఎటువంటి బాధ్యతలు లేని నార్మల్ ట్రాన్స్ఫర్ ను ఎదుర్కొన్నారు. ఈయనకు సమర్ధత ఉంది. కాకపోతే సమీకరణాలవల్ల పోస్టింగ్ కు దూరంగా ఉండాల్సి వస్తోంది. గతంలోని వరంగల్ కలెక్టర్ గా.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా పని చేశారు. ఆ అనుభవాన్ని కూడా ప్రభుత్వం వినియోగించుకోలేదు.ఈమె క్రేజీ అధికారిగా పేరు తెచ్చుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎక్కువకాలం తెలంగాణ రాష్ట్రంలో పనిచేశారు. ఇక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక అధికారిగా వ్యవహరించారు. ముఖ్యంగా మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టులలో ముఖ్యపాత్ర పోషించారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈమెకు విపరీతమైన ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. ఒక దశలో ఈమె నెక్స్ట్ టు సీఎం అన్నట్టుగా వ్యవహరించారు. ప్రభుత్వం మారిన తర్వాత స్మితకు ప్రాధాన్యం తగ్గిపోయింది. పైగా అస్మిత సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పరోక్ష విధానంలో

విమర్శలు చేయడం మొదలుపెట్టారు. ఈమె వ్యవహార శైలిపై కూడా ప్రభుత్వ పెద్దలకు ఆగ్రహం ఉండడంతో ప్రాధాన్యం లేని విభాగాలు కేటాయించారు. దీంతో ఆమె ఆ బాధ్యతలు స్వీకరించడం కంటే.. ఖాళీగా ఉండడానికి ఇష్టాన్ని చూపించారు.ప్రభుత్వాలు మారినప్పుడు అధికారులకు ఇంపార్టెన్స్ తగ్గిపోతూ ఉంటుంది. అయితే కొంతమంది అధికారులు ప్రభుత్వాలకు తగ్గట్టుగా మారకుండా.. తమకంటూ ఓన్ స్టైల్ క్రియేట్ చేసుకోవడమే ఇక్కడ ఇబ్బందికరంగా మారుతుంది. స్మిత.. ఆమ్రపాలి వీరిద్దరూ సమర్థవంతమైన అధికారులు. రాజకీయ కారణాలవల్ల పోస్టులు లభించకపోవడంతో దీర్ఘకాలం సెలవులో ఉన్నారు ఇటువంటి అధికారులకు పోస్టింగులు లభించకపోవడం ఒకరకంగా ప్రజలకు ఇబ్బంది. సమర్థత ఉన్న అధికారులు దీర్ఘకాలం విశ్రాంతి తీసుకుంటే ప్రజా సమస్యలు పరిష్కారం కావడం దాదాపు అసాధ్యం.

# డబుల్‌డెక్ కారిడార్ డీపీఆర్ రెడీ

**హైదరాబాద్, ఆగస్టు 11, పెన్ పవర్:**
హైదరాబాద్--ముంబయి జాతీయ రహదారిలో చందానగర్--గంగారం వద్ద ఫ్లైఓవర్‌పై మెట్రో వయాడక్ట్ ఉండేలా డబుల్‌డెక్ డిజైన్‌ను NHAI, ఎచ్ఎమ్ఆర్ సంయుక్తంగా ఖరారు చేశాయి. మియాపూర్--పటాన్‌చెరు మెట్రో విస్తరణతో సమన్వయం చేసేందుకు ఈ నమూనాను ప్రతిపాదించారు. మరోవైపు ఎల్బీనగర్--హయత్‌నగర్‌లోనూ డబుల్‌డెక్ నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి కోరుతున్నారు.అయితే అక్కడ మెట్రో అలైన్‌మెంట్ ఇప్పటికే సర్వీస్ రోడ్డు వెంట ఖరారై,డీపీఆర్ కేంద్రానికి చేరడంతో మార్పులు చేస్తే ఆలస్యం, వ్యయం పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు.హైదరాబాద్ నగరంలో రోడ్డు, మెట్రో మౌలిక వసతులను సమన్వయంతో అభివృద్ధి చేసేందుకు మరో కీలక అడుగు పడింది. నగరం నుంచి ముంబయి వైపు వెళ్లే జాతీయ రహదారి మార్గంలో చందానగర్--గంగారం ప్రాంతం వద్ద డబుల్‌డెక్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌ను జాతీయ రహదారుల సంస్థ, హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ సంయుక్తంగా ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మార్గంలో ఒకే కారిడార్‌లో రహదారి ఫ్లైఓవర్‌తోపాటు దాని పైన మెట్రో వయాడక్ట్ నిర్మించేలా డిజైన్ రూపొందించారు.ప్రస్తుతం మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రోరైలు విస్తరణకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇదే మార్గంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు జాతీయ రహదారుల సంస్థ ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని చేపడుతోంది. ఒకే ప్రాంతంలో భవిష్యత్తులో రోడ్డు ఫ్లైఓవర్, మెట్రో మార్గాలను వేర్వేరుగా నిర్మిస్తే భూసేకరణ, స్థల లభ్యత, నిర్మాణ వ్యయం వంటిసమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీంతో రెండు ప్రాజెక్టులను సమన్వయం చేసి డబుల్‌డెక్ రూపంలో నిర్మించాలనే ఆలోచనకు ప్రాధాన్యం లభించింది.ఫ్లైఓవర్ నిర్మించాల్సిన ప్రాంతాల్లో భవిష్యత్తులో మెట్రోవిస్తరణ ఉంటే ముందుగానే డబుల్‌డెక్ నమూనాను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గతంలో సూచించారు. కింద రహదారి వాహనాల కోసం ఫ్లైఓవర్, దాని పైన మెట్రోవయాడక్ట్ ఉండే విధంగా ఈ నిర్మాణం ఉంటుంది. నాగ్‌పూర్‌లో ఇలాంటి డబుల్‌డెక్ కారిడార్‌ను దేశంలోనే తొలిసారిగా నిర్మించారు. ఒకే మార్గంలో రెండు రవాణా వ్యవస్థలకు స్థలం కల్పించడం ద్వారాభూసేకరణ అవసరాన్ని తగ్గించడంతో పాటు నగరాల్లో పరిమిత స్థలాన్ని సమర్థంగా వినియోగించుకోవచ్చన్నది ఈ నమూనా ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకుజాతీయ రహదారిపై ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ మార్గంలోనూ డబుల్‌డెక్ నిర్మించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టుబడుతున్నారు. అయితే చందానగర్--గంగారం మార్గంతోపోలిస్తే ఇక్కడ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఎల్బీనగర్--హయత్‌నగర్ మెట్రో విస్తరణకు సంబంధించిన అలైన్‌మెంట్‌ను ఇప్పటికే సర్వీస్ రహదారి వెంబడి ప్రతిపాదించారు. దీనికి సంబంధించిన సమగ్రప్రాజెక్టు నివేదికలు కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఇప్పుడు ఈ అలైన్‌మెంట్‌ను మార్చి ఫ్లైఓవర్‌పై మెట్రోను ఏర్పాటు చేసేలా డబుల్‌డెక్ నమూనాను అమలు చేస్తే ఇప్పటికే సిద్ధం చేసిన డీపీఆర్‌లోమార్పులు చేయాల్సి ఉంటుంది.డీపీఆర్‌లో మార్పులు, కొత్త డిజైన్, సాంకేతిక పరిశీలనలు, అనుమతుల ప్రక్రియ కారణంగా ప్రాజెక్టు అమలులో జాప్యం జరిగే అవకాశం ఉందని మెట్రోరైలు అధికారులుమంత్రికి వివరించినట్లు సమాచారం.

అదనంగా నిర్మాణ వ్యయం కూడా పెరిగే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన మెట్రో అలైన్‌మెంట్‌ను కొనసాగిస్తే పనులనువేగంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని వారు సూచించినట్లు తెలిసింది.మరోవైపు హైదరాబాద్ మెట్రో రెండోదశకు కేంద్ర అనుమతులు త్వరలో వచ్చే అవకాశం ఉందన్న ఆశాభావం ప్రభుత్వవర్గాల్లో వ్యక్తమవుతోంది. మరో రెండు నెలల్లో రెండోదశకు సంబంధించిన అనుమతులు వస్తాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆశాభావం వ్యక్తం చేసిన నేపథ్యంలో, మెట్రో మార్గాల తుది అలైన్‌మెంట్, ఫ్లైఓవర్లతో సమన్వయం వంటి అంశాలు కీలకంగా మారాయి. భవిష్యత్తులో ట్రాఫిక్ పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని రహదారి, మెట్రో ప్రాజెక్టులను సమగ్రంగా ప్రణాళిక చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు

# కార్పొరేట్ పాఠశాలలా.. కబళించే స్కూళ్లా

**హైదరాబాద్, ఆగస్టు 11, పెన్ పవర్:** ఉత్తమమైన విద్య అందుతుందని.. ఉపాధ్యాయులు మెరుగ్గా బోధన చేస్తారని.. తమ పిల్లలు ప్రయోజకులవుతారని చాలామంది తల్లిదండ్రులు కార్పొరేట్ పాఠశాలలకు పంపిస్తుంటారు. అప్పులు తెచ్చి అయినా సరే తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుంటారు .ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సదుపాయాలు ఉండవని.. ఉపాధ్యాయులలో జవాబుదారితనం కనిపించదని.. పిల్లలకు సక్రమమైన విద్య అందదని భావించే తల్లిదండ్రులు.. తమ స్తోమతకు మించినా సరే పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పిస్తుంటారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని కాపాడి.. విద్యార్థులకు ఉత్తమమైన విద్య అందించి.. మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రుల నుంచి లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తూ.. విద్యార్థులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి.యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారుతుంది. పైగా ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాల్సిన చోట దారుణంగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న దమ్మాయిగూడ లో శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల మధ్య ర్యాగింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఒక పదవ తరగతి విద్యార్థిని తోటి విద్యార్థులు కర్రలతో కొట్టారు. బూటు కాళ్లతో తన్నారు.. ఈ విషయం ఆ విద్యార్థి తల్లిదండ్రుల పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. తోటి విద్యార్థుల దాడిలో గాయపడిన అభిషేక్ అనే విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు ఈ వ్యవహారాన్ని ఆసుపత్రి యాజమాన్యం మరో విధంగా చిత్రీకరించడం మొదలుపెట్టింది. ఆ విద్యార్థి మెట్లపై నుంచి పడినట్టు చెబుతోంది. వాస్తవానికి విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండేలాగా యాజమాన్యం కృషి చేయాలి. విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం బాటలు పరచాలి. తోటి విద్యార్థుల మధ్య ఈ స్థాయిలో ర్యాగింగ్ జరిగింది అంటే అది ముమ్మాటికి యాజమాన్యం నిర్లక్ష్యమే.ఉన్నతమైన చదువులు చెప్తారని శ్రీ చైతన్య లో చేర్పించాం. భారీగా ఫీజులు కూడా చెల్లిస్తున్నాం. అయినప్పటికీ ఇక్కడ విద్యార్థులకు సరైన సెక్యూరిటీ లేదు. తోటి విద్యార్థులు ఒకరిని ఒకరు కొట్టుకుంటుంటే మేనేజ్మెంట్ ఏం చేస్తోంది.. విద్యార్థులను పర్యవేక్షించాలి కదా.. నిత్యం కనిపెట్టుకొని ఉండాలి కదా. ఇంతలా దాడులు చేసుకున్నారంటే ఏమనుకోవాలి.. ర్యాగింగ్ విష సంస్కృతి ఈ స్థాయిలో పెచ్చరిల్లిపోతుంటే మేనేజ్మెంట్ నిశ్శబ్దంగా ఉంది.. మా అబ్బాయి పరిస్థితి చూస్తే దారుణంగా ఉందని అభిషేక్ తల్లిదండ్రులు చెప్తున్నారు. మరి దీనిపై యాజమాన్యం ఇంతవరకు స్పందించలేదు.

# వైసీపీ ప్రోగ్రాం సక్సెస్...కానీ వాళ్ళు రాలేదు !



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ గత రెండేళ్ళలో ఎన్నడూ లేని విధంగా జనం బాట పట్టింది. ఆందోళనలకు పిలుపు ఇచ్చింది. నిరసనలు పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. ఒక విధంగా చెప్పాలీ అంటే వైసీపీ ఒక ఇష్యూని పట్టుకుని ఇంత సుదీర్ఘంగా ఆందోళన చేసిన దాఖలాలు అయితే గతంలో లేవు. కానీ మెగా డీఎస్సీ విషయంలో వైసీపీ దూకుడు చేస్తోంది. అక్రమాలు జరిగాయని అంటూ ఏకంగా టీడీపీ కూటమిలో అతి ముఖ్య నాయకుడు, విద్యా శాఖ మంత్రి అయిన నారా లోకేష్ మీద ఫుల్ ఫోకస్ పెట్టేసింది. ఒక విధంగా చెప్పాలీ అంటే గట్టిగానే టార్గెట్ చేసింది. దాంతో ఏపీలో పది రోజులుగా వైసీపీ నిరసన కార్యక్రమాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటి ప్రభావం ఎలా ఉంది, జనాల నుంచి రెస్పాన్స్ ఎలా ఉంది అన్నది కనుక చూస్తే వైసీపీ ప్రోగ్రాం సక్సెస్ అని అంటున్నారు. కానీ అని అక్కడే ఆగిపోతున్నారు.

**వైసీపీకి ఇదే ఫస్ట్ టైం :**

ఇక వైసీపీ 2024 తరువాత ఘోరంగా ఓటమి చెంది 11 సీట్లకే పరిమితం అయిన తరువాత గడచిన రెండేళ్ళ కాలంలో చేపట్టిన అనేక ఆందోళనలు నిరసనలతో పోలిస్తే మెగా డీఎస్సీ మీద ఆ పార్టీ చేపట్టిన పోరాటం మాత్రం హైలెట్ అని చెప్పాల్సి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ ప్రోగ్రాం బాగానే సాగింది. ఒక్క ప్రకాశం జిల్లాలో తప్పించి అన్ని చోట్ల సక్సెస్ అయింది అని అంటున్నారు. మరి ఇంతలా అన్ని చోట్ల వైసీపీ ప్రోగ్రాం సక్సెస్ అయితే ఒక్క ఆ జిల్లాలోనే ఎందుకు అలా అన్నదే ఇపుడు చర్చగా ఉంది.

**ప్రకాశంలో ఎందుకంటే :**

ప్రకాశం జిల్లాలో ఇంచార్జిలు క్యాడర్ ని పెద్ద ఎత్తున తీసుకుని రాలేకపోయారు. ఈ జిల్లాలో క్యాడర్ అయితే అంత దూకుడుగా లేదా అన్నది చర్చగా ఉంది. అలాగే ఇంచార్జిలే తమ జోరుని చూపించలేకపోయారా అన్న ప్రశ్నలు కూడా వస్తున్నాయి. ఇంకో వైపు చూస్తే వైసీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు జనాలు అన్ని చోట్ల పోటెత్తారు. అలాగే చాలా కాలం తరువాత వైసీపీ క్యాడర్ లో ఉత్సాహం కనిపించింది. అలాగే వైసీపీ నాయకులు కూడా అంతా కలసి హుషార్ గా పాల్గొనడం కూడా జరిగింది. అదే సమయంలో మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని చెబుతున్న అభ్యర్థులు కానీ నిరుద్యోగులు కానీ యువత కానీ ఈ మొత్తం ఆందోళనలో ఎక్కడా కనిపించకపోవడమే ఒక లోటుగా చెబుతున్నారు.

**అదే కారణమా అంటూ :**

మరి వారు ఎందుకు పాల్గొనలేదు అంటే దానికి రీజనబుల్ గా వచ్చే సమాధానం కూడా ఉంది. తాము వచ్చి వైసీపీ చేసే ఆందోళనలలో

పాలుపంచుకుంటే కెమెరాలకు చిక్కితే తమ భవిష్యత్తు ఎక్కడ ఇబ్బంది పడుతుందో అన్న ఆలోచనతోనే వారు వెనక్కి ఉండిపోయారు అని అంటున్నారు. ఒక రాజకీయ పార్టీ చేపట్టే ఆందోళనలో పాలు పంచుకుంటే తమకు మళ్ళీ జాబ్స్ రావు అన్న బెంగ కూడా వారికి ఉండడం వల్లనే ఎక్కడా కనిపించకుండా తెర వెనక్కే ఉండిపోయారు అని అంటున్నారు. అయితే ఎవరి కోసం ఈ కార్యక్రమం వైసీపీ చేసిందో వారు కానీ యువత కానీ కనిపించకపోవడం మాత్రం ఆ పార్టీకి మైనస్ గానే మారింది అని అంటున్నారు. దీంతో వైసీపీ నిరసనలకు జనాల నుంచి మంచి స్పందన వచ్చినా కూడా అసలైన వారు డీఎస్సీ రాసిన అభ్యర్థులు ఎక్కడా కనిపించకపోవడంతో ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డైడ్ అన్నట్లుగా వైసీపీ ప్రోగ్రాం తయారైంది అని అంటున్నారు. ఏది ఏమైనా వైసీపీ వరకూ చూస్తే మాత్రం ఈ నిరసనలు హిట్ అయి మంచి బూస్ట్ ఇచ్చాయనే అంటున్నారు.

# సీడ్ యాక్సిస్ రోడ్ రెడీ...

**అమరావతి, ఆగస్టు 11 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ ప్రక్రియలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి ముహూర్తం ఖరారైంది. రాజధాని నగరానికి లైఫ్‌లైన్‌గా చెప్పుకుంటున్న సీడ్ యాక్సిస్ రోడ్డులోని అత్యంత కీలకమైన భాగం ఆగస్టు 13 నుంచి ప్రజలకు అందుబాటులోకి రాబోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మక రహదారితోపాటు, ప్రజాప్రతినిధుల కోసం నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లను కూడా అదే రోజున అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందు అంటే 12 ఆగస్టు ముఖ్యమంత్రి కాన్వాయ్‌తో ఈ రహదారిపై అధికారికంగా ట్రయల్ రన్ నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో అత్యంత కీలకమైన ఈ రహదారిని టెక్నికల్‌గా జు–3 రోడ్డుఅని పిలుస్తారు. ఇది రాజధాని నగరంలోని ఉత్తరం నుంచి దక్షిణానికి ఉండే 17 ప్రధాన ఎన్ సిరీస్ రోడ్లను ఒకదానితో ఒకటి కలిపే మార్గం. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు మొత్తం పొడవు 21.78కిలోమీటర్లు. ఇది దొండపాడు గ్రామం వద్ద ప్రారంభమై రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి గ్రామాల మీదుగా సాగి మణిపాల్ ఆసుపత్రి వద్ద జాతీయ రహదారితో కలుస్తుంది. ఈ రోడ్డుకు సంబంధించి రైట్ ఆఫ్ వే 60 మీటర్లుగా నిర్ణయించారు. భవిష్యత్‌లో దీనిని 8 నుంచి 9 లేన్‌ల వరకు విస్తరించేలా ప్రభుత్వం ప్లాన్ చేసింది. ప్రస్తుతం 11 మీటర్ల వెడల్పుతో కూడిన క్యారేజ్ వేస్, సర్వీస్ రోడ్లు, సెంట్రల్ బీఆర్‌టీఎస్ కారిడార్‌తో నిర్మించారు.

**మూడు దశల్లో అభివృద్ధి**

ఈ భారీ ప్రాజెక్టును అధికారులు మూడు దశలుగా విభజించారు. ఫేజ్–1 పొడవు 14. 35 కిలోమీటర్లు. ఇది దొండపాడు నుంచి వెంకటపాలెం (మంతెన ఆశ్రమం) వరకు ఉంటుంది. ఇది ఇప్పటికే పూర్తి అయ్యి రాకపోకలు సాగుతున్నాయి. రెండోది 3.92 కిలోమీటర్ల పొడవు ఉన్న ఫేజ్ –2. వెంకటపాలెం నుంచి ఉండవల్లి వరకు సాగుతుంది. ఈ భాగమే ఆగస్టు 13న ప్రారంభమవుతుంది. భూసేకరణ సమస్యలు, కోర్టు వ్యాజ్యాలను అధిగమించి ప్రభుత్వం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. 3.50 కిలోమీటర్ల పొడవు ఉన్న ఫేజ్ –3 ఉండవల్లి నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు నిర్మిస్తున్నారు. ఇందులో ఒక భారీ ఎలివేటెడ్ కారిడార్ 320 మీటర్ల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రహదారిలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నవి ఉండవల్లి వద్ద నిర్మించిన భారీ స్టీల్ బ్రిడ్జులు. 110 మీటర్ల పొడవుతో బకింగ్‌హమ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జి నిర్మించారు. దానిపై తారు పనులు పూర్తి చేశారు. రాజధానికి వరద ముప్పు లేకుండా చేసే కొండవీటి వాగుపై 284మీటర్‌ల పొడవుతో అధునాతన స్టీల్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాన్ని కేవలం ఒక రహదారిగానే కాకుండా, ఒక పర్యాటక కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణానది, కొండవీటి వాగు అందాలను చూసేందుకు ఇక్కడ ప్రత్యేక వ్యూ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణహితంగా ఉండేందుకు సైక్లింగ్ ట్రాక్‌లు, వాకింగ్ ట్రాక్‌లు, సుందరమైన ల్యాండ్‌స్కేప్ గార్డెన్లను అభివృద్ధి చేస్తున్నారు. విజయవాడ నుంచి అమరావతి సచివాలయానికి హైకోర్టుకు వెళ్లే వేల మంది ఇరుకైన కరకట్ట రహదారిపై ఆధారపడేవారు. ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదకరమైన మలుపులు, గుంతల రోడ్డులతో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు అందుబాటులోకి రావడంతో విజయవాడ నుంచి అమరావతికి వెళ్లేందుకు సమయం ఆదా అవుతుంది. దాదాపు అర గంట కలిసి వస్తుంది. నాలుగు లేన్ల రహదారి కావడంతో ప్రమాదాల భయం లేదు. ఈ కారిడార్ వెంబడి ఉన్న ఉండవల్లి, పెనుమాక, మందడం ప్రాంతాల్లో భూముల రేట్లు పెరగనున్నాయి. ఐటీ కంపెనీలు, హోల్స్ రానున్నాయి. ముఖ్యమంత్రి పర్యటన కోసం అమరావతి అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీపార్థసారథి, గుంటూరు కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్పీ వకుల్ జిందాల్ ఉండవల్లి స్టీల్ బ్రిడ్జి ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లు సమీక్షించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన సీడ్ యాక్సిస్ రోడ్డు ప్రాజెక్టు కోసం మొత్తం 320. 54 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఇందులో ఇప్పటికే 278.93 ఎకరాలను సేకరించారు. మిగిలిన భూసేకరణ ప్రక్రియ తుది దశలో ఉంది. ఈ రహదారి కేవలం రవాణా కోసమే కాకుండా రాజధాని నగరంలో గ్యాస్ పైప్‌లైన్లు, వాటర్ మెయిన్స్, ఐసీటీ కారిడార్లు వంటి భూగర్భ వసతుల ఏర్పాటుకు ఉపయోగపడనుంది.

# ఏపీలో కుటుంబ రాజకీయాలు..సమీకరణలు!

**విజయవాడ, ఆగస్టు 11 పెన్ పవర్:**
వైయస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి కోరుకుంది ఆ ఫ్యామిలీ. అందుకు పార్టీ హై కమాండ్ అంగీకరించకపోవడంతో జగన్మోహన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. కేసుల రూపంలో సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది.. ఆ ఫ్యామిలీ మద్దతుతోనే పార్టీని ఏర్పాటు చేశారు. తొలి ఎన్నికల్లో అధికార పార్టీకి ధీటుగా సీట్లు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. తల్లి విజయలక్ష్మి, చెల్లెలు షర్మిల, బాబాయ్ వివేకానంద రెడ్డి, సోదరులు అవినాష్ రెడ్డి, మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి.. ఇలా చెప్పుకుంటే ఆ ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది. అయితే అదే సమయంలో టిడిపిలో చూస్తే మాత్రం చంద్రబాబుతో పాటు లోకేష్ కు సొంత కుటుంబం దన్ను అంతగా లేకపోయింది. కానీ ఇప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండ తగ్గింది. చంద్రబాబుకు గణనీయంగా పెరుగుతూ వస్తోంది.తెలుగుదేశం అధినేత చంద్రబాబు విషయంలో కుటుంబ పరంగా ఒక భిన్న వాతావరణం ఉండేది. నందమూరి హరికృష్ణ అండగా నిలిచేవారు. కానీ అదే సమయంలో రెబల్గా కూడా వ్యవహరించేవారు. ఎప్పుడు ఎలా ఉండేవారో తెలియంది కాదు. మరోవైపు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి

దంపతులు సైతం వ్యతిరేకంగా ఉండేవారు. చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలిపారు. మరోవైపు సమీప బంధువు, జూనియర్ ఎన్టీఆర్ మామ నార్నియా శ్రీనివాసరావు సైతం చంద్రబాబుకు పూర్తిగా వ్యతిరేకంగా మారిపోయారు. ఇలా సొంత కుటుంబ సభ్యులే చికాకుల మీద చికాకులు తెచ్చి పెట్టేవారు. మరోవైపు లోకేష్ ఆశించిన స్థాయిలో పట్టు పెంచుకోలేదు అప్పట్లో.అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎవరు మనసులో ఏముంటుందో కూడా చెప్పలేము. అప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండగా నిలబడగా.. ఇప్పుడు అదే ఫ్యామిలీ వ్యతిరేకంగా మారిపోయింది. మొదట చెల్లెలు షర్మిల దూరమయ్యారు. ఆమెకు అండగా నిలిచేందుకు జగన్మోహన్ రెడ్డికి దూరమయ్యారు తల్లి విజయమ్మ. బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసుతో కుటుంబం అంతా అడ్డగోలుగా చీలిపోయింది. మరో చెల్లెలు సునీత పూర్తిగా ప్రత్యర్థిగా మారిపోయారు. ఇప్పుడు కేవలం జగన్మోహన్ రెడ్డి వెంట కుటుంబంలో నిలిచేది అవినాష్ రెడ్డి, ఆయన ఫ్యామిలీ. మిగతా వారంతా దూరమైనట్టే. కేవలం దూరం మాత్రమే కాదు రాజకీయంగా విభేదించడం కూడా మొదలుపెట్టారు. మొన్నటి ఎన్నికల్లో ప్రభావం కూడా చూపారు..అయితే ఇప్పుడు చంద్రబాబు విషయానికి వద్దాం. నందమూరి ఫ్యామిలీ పూర్తిగా ఆయనకు అండగా నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ సైతం మౌనం వహించక తప్పడం లేదు. తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం రాజీ పడ్డారు. మొన్నటి ఎన్నికల్లో బిజెపితో తెలుగుదేశం పొత్తుకు పురందేశ్వరి ఒక కారణం. ప్రస్తుతం వారి కుమారుడు సైతం నారా లోకేష్ తో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంకోవైపు నారా రోహిత్ అంటే చంద్రబాబు తమ్ముడి కుమారుడు సైతం లోకేష్ తో కలిసి పని చేస్తున్నారు. ఇంకో వైపు లోకేష్ తోడల్లుడు, నందమూరి బాలకృష్ణ చిన్న అల్లుడు శ్రీ భరత్ సైతం పార్టీకి అండదండగా నిలుస్తూ వచ్చారు.. ఇలా చెప్పుకుంటే ఫ్యామిలీలు ఇప్పుడు అంతా ఒక్కటై చంద్రబాబుకు అండగా నిలబడుతున్నాయి. జగన్మోహన్ రెడ్డితో పోల్చుకుంటే చంద్రబాబుకు ఇప్పుడు ఫ్యామిలీ బలం అదనం.

## వైసీపీకి బూమ్ రాంగ్ అవుతోందా

**విజయవాడ, ఆగస్టు 11 పెన్ పవర్:** రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, చట్టాలు–పరిపాలనపై క్షుణ్ణమైన అవగాహన ఉన్న ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ వంటి వైఎస్సార్సీపీ సీనియర్ నేతలకు ఏది ప్రజాదరణ పొందే అంశమో, ఏది శూన్యమైన విమర్శో స్పష్టంగా తెలుసు. దశాబ్దాల తరబడి ఎన్నికల రాజకీయాలను ఒంటబట్టించుకున్న ఈ అనుభవజ్ఞులకు.. కనీస ఆధారం లేకుండా ప్రతిపక్షం లేవనెత్తే అంశాలు ప్రతికూలతను పెంచుతాయే తప్ప, ప్రజల నుంచి ఒక్క శాతం కూడా సానుకూలతను తీసుకురావు అనే నిలువెత్తు సత్యం తెలియంది కాదు. అయినా సరే, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్దేశిస్తున్న వ్యూహాలకు తలొగ్గి, తమ సొంత రాజకీయ క్రెడిబిలిటీని బలిపీఠం ఎక్కించేసుకుంటున్నారు.గతంలో ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ హయాం నుంచి నేటి వైఎస్సార్సీపీ వరకు సీనియర్ నాయకులుగా చెరగని ముద్ర వేసుకున్న ఈ నేతలు.. జగన్ అనుసరిస్తున్న ఏకపక్ష రాజకీయ శైలి వల్ల సమాజంలో తమ ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నారనే చర్చ నడుస్తోంది. డీఎస్సీ వంటి నిరుద్యోగ సున్నిత అంశాలపై ఎటువంటి డాక్యుమెంటరీ ఆధారాలు లేకపోయినా, కోర్టుల్లో విచారణకు కూడా నిలబడే సాక్ష్యాలు చూపించలేకపోయినా.. జగన్ మైక్ ముందు చెప్పిన ప్రతిపాయింట్‌నూ కిందిస్థాయిలో బలవంతంగా మోయాల్సి రావడం వారి రాజకీయ అనుభవానికే అవమానకరంగా మారింది. ఆధారం లేని పోరాటం వల్ల ఎంపికైన 16,000 మందికి పైగా ఉపాధ్యాయులు, వారి కుటుంబాల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోంది.తన స్వయంకృతాపరాధ నిర్ణయాలతో స్వయంగా నెత్తిపై చేయి పెట్టుకునే భస్మాసుర రాజకీయాన్ని జగన్ నడుపుతుంటే, సీనియర్లు తెలిసీ తెలియక అందులో భాగస్వాములు అవుతున్నారనేది నిగ్గు తేలిన నిజం. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా సజ్జల రామకృష్ణారెడ్డి నెట్‌వర్క్ చెప్పినట్లే వినాల్సి వచ్చిందని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా సరే అదే తీరు కొనసాగుతోందని అంతర్గత మధనం వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో సంపాదించుకున్న గుర్తింపును, ఇమేజ్‌ను ఒకే వ్యక్తి రాజకీయ ఆధిపత్యం, వ్యర్థ రాజకీయ ఎజెండాల కోసం ధారపోయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు.ఇంత బతుకు బతికి సొంత రాజకీయాన్ని, స్వయంప్రతిపత్తిని పక్కనబెట్టి జగన్ రెడ్డి వద్ద ఈ రకంగా డీలా పడిపోవడానికి వారి మనసు ఎలా ఒప్పుతుందోగానీ, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే వారి రాజకీయ జీవితాలకు ఇది తీవ్రమైన నష్టం చేకూరుస్తుంది. అధినేత చెప్పే తప్పుడు కథనాలకు మద్దతుగా ప్రెస్ మీట్లు పెట్టడం ఆపి, ఇప్పటికైనా తమ రాజకీయ వ్యూహాలను సమీక్షించుకోవాల్సిన తక్షణం ఆసన్నమైంది. సమాజంలో తమకున్న గౌరవాన్ని కాపాడుకోవడానికైనా లేదా ప్రత్యమ్నాయ రాజకీయ దారులు చూసుకోవడానికైనా ఈ సీనియర్ నాయకులు మౌనం వీడాల్సిన అవసరం ఉంది.

**సాంకేతిక అవకతవకలు, అక్రమాలు**

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, రికార్డు స్థాయిలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీపై ప్రతిపక్షం ఆది నుంచి ఆరోపణలు గుప్పిస్తూనే ఉంది. అయితే ఆ ఆరోపణల్లో ఒక్కటంటే ఒక్క బలమైన చట్టబద్ధమైన ఆధారాన్ని కూడా వైసీపీ బయటపెట్టలేకపోయింది. సాంకేతిక అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఎన్ని కథనాలు అల్లినా, నిరుద్యోగులు గానీ, పరీక్ష రాసిన వేలాది మంది అభ్యర్థులు గానీ వాటిని నమ్మే పరిస్థితి లేదు. న్యాయస్థానాలను ఆశ్రయించి పక్కా సాక్ష్యాధారాలతో సీబీఐ విచారణ కోరడంలో ఆ పార్టీ తరపు నేతలు ఘోరంగా విఫలమయ్యారు. కోర్టుల్లో నిలబడని, ఆధారాలు సమర్పించలేని కథనాలతో వీధుల్లో రచ్చ చేయడం వల్ల ఆ పార్టీ చేస్తున్నది ప్రజాపోరాటం కాదని, కేవలం ఒక కుట్రపూరిత తప్పుడు రాజకీయం అని సామాన్య ప్రజలకు సైతం అర్థమైపోయింది.అన్నింటికంటే ముఖ్యంగా, ఈ ఉనికి లేని వివాదం వల్ల వైఎస్సార్సీపీ సమాజంలో తీవ్ర ప్రతికూలతను మూటగట్టుకుంటోంది. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన దాదాపు 16,347 మంది ఉపాధ్యాయులు, వారి వెనుకున్న వేలాది కుటుంబాలు ఇప్పుడు ప్రతిపక్ష వైఖరిపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయి. దశాబ్దాల కష్టంతో, పారదర్శకమైన పోటీలో తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే, తమ అర్హతలను, ఆత్మగౌరవాన్ని పదేపదే శంకిస్తూ పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకోవడాన్ని ఆ ఉపాధ్యాయ లోకం సహించలేకపోతోంది. రాయలసీమ నుంచి మొదలై కోస్తాంధ్ర వరకు ఈ ఉద్యోగ విజేతలు ఉపాధ్యాయ ఆత్మగౌరవ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతున్నారు.ప్రజాబలం తోడుకాకపోగా, యువత నుంచి మద్దతు లభించకపోగా, పైగా ఎంపికైన 16 వేలకు పైగా కుటుంబాల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకోవడం రాజకీయంగా ఎంత పెద్ద వ్యూహాత్మక తప్పిదమో స్పష్టమవుతోంది. రాలగొట్టుకోవడానికి ఏ రాయి అయితే ఏమిటి అన్నట్లుగా ఆలోచన లేకుండా ఒక ప్రతికూల అంశాన్ని పదేపదే పట్టుకుని వేలాడటం వల్ల వైసీపీకి లభించే రాజకీయ లబ్ధి సున్నా సరేకదా, ఉన్న అరకొర క్రెడిబిలిటీని కూడా నట్టేట ముంచేస్తోంది. ప్రజామోదం లేని ఇటువంటి వ్యర్థ పోరాటాల వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి పడకపోగా, ప్రతిపక్షం తన సొంత ఓటు బ్యాంకునే మరింత దూర చేసుకుంటోందనేది అసలు నిజం

## సునీత ఒంటరి పోరాటం...

**కడప, ఆగస్టు 11 పెన్ పవర్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతారెడ్డి ఎన్నో ఏళ్లుగా వేస్తున్న అత్యంత ప్రాథమిక, కీలకమైన ప్రశ్న ఇదే. ఈ విషయం సీబీఐ అఫిడవిట్‌లోనే ఉంది. బయట ప్రపంచానికి, కనీసం ఇంట్లో పనిచేసే సిబ్బందికి కూడా తెలియక ముందే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి హత్య విషయం ఎలా తెలిసింది? ఈ ఒక్క ప్రశ్నకు చట్టబద్ధంగా విచారణ సంస్థలు సమాధానం కనుగొంటే, హత్య వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులు బయటపడతారని సునీత బలంగా నమ్ముతున్నారు. తెలంగాణ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌లో సైతం మార్చి 15, 2019 ఉదయం 6:15 గంటలకు వివేకా పీఏ కృష్ణారెడ్డి ద్వారా వార్త బయటకు రావడానికి ముందే జగన్‌కు ఈ విషయం తెలుసని పేర్కొనడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది.న్యాయస్థానాల్లో ప్రతిపక్ష డిఫెన్స్ లాయర్లు దీనిపై వాదిస్తూ.. కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య సమాచారం త్వరగా మార్పిడి కావడం సహజమేనని, దాంట్లో నేరపూరిత కోణం ఏమీ లేదని సరిపెట్టుకునే యత్నం చేశారు. అయితే ఇక్కడే అసలు రాజ్యాంగ, న్యాయపరమైన లోపం స్పష్టమవుతోంది. బంధువులకు సమాచారం అందింది అనే సాధారణ సాకుతో వార్త ఎక్కడి నుంచి వచ్చిందో విచారించకుండా విస్మరించడం సమంజసం కాదనేదిసునీత వాదన. హత్య జరిగిన అర్ధరాత్రి దాటిన సమయం నుంచి ఉదయం వరకు కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఫోన్ నుంచి నడిచిన వాట్సాప్, వాయిస్ కాల్స్ ఐపీడీఆర్ డేటాను సీబీఐ అఫిడవిట్‌లోప్రస్తావించినప్పటికీ, ఆ సమాచారం కనెక్షన్ చివరగా ఎక్కడ ముగిసిందో పూర్తి స్థాయిలో మనీ–పవర్ ట్రయల్‌తో ముడిపెట్టి తేల్చకపోవడమే అసలు వివాదం.న్యాయం కోసం సునీత పడుతున్న తపన, సాగిస్తున్న పోరాటం సాధారణమైంది కాదు. కింది కోర్టుల నుంచి సుప్రీంకోర్టు వరకు, ఏపీ నుంచి విచారణను తెలంగాణకు బదిలీ చేయించడం వరకు ఆమె అలుపెరగకుండా పోరాడుతున్నారు. హత్య వెనుక ఎవరున్నారనేది ప్రజలందరికీ ఒక అంచనా ఉన్నప్పటికీ.. దానిని చట్టబద్ధమైన సాక్ష్యాధారాలతో కోర్టు ముందు రుజువు చేసి, నిందితులకు శిక్ష పడేలా చేయడమే ఆమె అంతిమ లక్ష్యం. ఏడేళ్లు గడిచినా ఒక మాజీ ఎంపీ కుమార్తె న్యాయం కోసం వ్యవస్థల చుట్టూ తిరగాల్సి రావడం భారతీయ నేర విచారణ వ్యవస్థ లోని మందగమనానికి అద్దం పడుతోంది.ఈ తరుణంలోనే సునీత నేరుగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, కేసులోని పెద్ద కుట్ర కోణాన్ని, ముందస్తు సమాచారం ఎవరికి ఎలా చేరిందనే అంశాన్ని త్వరితగతిన తేల్చాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధ అత్యున్నత పీఠం జోక్యం చేసుకుని సీబీఐ దర్యాప్తునకు స్పష్టమైన కాలపరిమితిని, దిశానిర్దేశాన్ని ఇస్తే తప్ప ఈ కేసు ముడిపడేలా లేదు. ఒక కుటుంబం తమ ఆత్మీయుడిని కోల్పోయి, వ్యవస్థలు సహకరిస్తాయో లేదోనన్న ఆందోళనతో సాగిస్తున్న ఈ ఆత్మగౌరవ పోరాటానికి చట్టం నిజమైన న్యాయం చేస్తుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి.

## నిందితులకే మద్దతా... నిన్న అప్పలరాజు... ఇవాళ పాస్టర్ కోడుకు

**రాజమండ్రి, ఆగస్టు 11 పెన్ పవర్:** రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంకపై కారు ఎక్కించి దారుణంగా హత్య చేసిన ఉదంతం రాజకీయంగా, సామాజికంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ ప్రసిద్ధ పాస్టర్ కుమారుడు కావడంతో, ఈ వ్యవహారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, ముఖ్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తీవ్రమైన సంకట పరిస్థితిని తెచ్చిపెట్టింది. ఒకవైపు నిందితుడు తమకు అత్యంత కీలకమైన ఓటు బ్యాంక్ వర్గానికి చెందిన కుటుంబ నేపథ్యం కలవాడు కావడం, మరొకవైపు అత్యంత కిరాతకానికి గురైన బాధితురాలు వైద్య విద్యార్థిని కావడం వల్ల.. ఈ కేసులో ఎటువైపు నిలబడాలో తెలియక వైసీపీ రాజకీయ డైలమాలో పడింది. ఈ విమర్శలు రావడంతో చివరికి జగన్ ప్రభుత్వాన్ని నిందిస్తూ ఓ ట్వీట్ చేసి పడేశారు.ఇటీవల కాశిబుగ్గ సమీపంలో మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ జరిపిన హిట్ అండ్ రన్ కేసులో ఒక పేద గొర్రెల కాపరి దానయ్య ప్రాణాలు కోల్పోతే, వైసీపీ అనుసరించిన వైఖరి పైనే ఇప్పుడు ప్రధాన చర్చ జరుగుతోంది. ఆ కేసులో సొంత పార్టీ నేత కుమారుడిని రక్షించేందుకు వేరొక అనామకుడిపై నింద మోపే ప్రయత్నం చేశారు. దానయ్యను కాపాడే ప్రయత్నం చేయలేదు. దానయ్య కుటుంబాన్ని ఆదుకోలేదు. తప్పుడు కుట్రలు చేసినందుకు సీదిరి అప్పలరాజుపై కేసు నమోదు చేస్తే దాన్ని రాజకీయ కక్ష సాధింపు గా జగన్ రెడ్డి వర్గీకరించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బాధితుడైన గొర్రెల కాపరి కుటుంబం ఆవేదనను పక్కనపెట్టి, కేవలం తమ పార్టీ నేత, కుల సమీకరణాలకే జగన్ ప్రాధాన్యత ఇచ్చారు. మత్స్యకార నాయకుడ్ని వేధిస్తున్నట్లుగా ప్రచారం చేశారు.ఇదే ప్రాతిపదికన విశ్లేషిస్తే, ఇప్పుడు రాజమండ్రి కేసులో కూడా వైసీపీ అదే తరహా సొంత వర్గ రక్షణ వ్యూహాన్ని అమలు చేస్తుందా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. జోసెఫ్ ఎడ్వర్డ్స్ కుటుంబం సామాజికంగా, మతపరంగా వైసీపీకి సాంప్రదాయకంగా మద్దతు ఇచ్చే వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇప్పుడు గనుక రాజమండ్రి కేసులో నిందితులకు కఠిన శిక్ష పడాలని, వారిపై ఉద్దేశపూర్వక హత్య సెక్షన్లు సమర్థనీయమేనని వైసీపీ డిమాండ్ చేస్తోంది పైపైకే. ఎందుకంటే ప్రజాగ్రహం ఎక్కువగా ఉంది కాబట్టి ఇలా ప్రియాంక కోసం మాట్లాడుతున్నారు. మరి కాశిబుగ్గ కేసులో అప్పలరాజు కొడుకుపై చట్టం చర్యలు తీసుకున్నప్పుడు ఎందుకు వ్యతిరేకించారు? అక్కడ లేని న్యాయసూత్రాలు ఇక్కడ మాత్రమే గుర్తుకొచ్చాయా?అంతేకాకుండా, ప్రియాంక తండ్రి కడుపుకోతతో మాట్లాడుతున్న మాటలను సైతం రాజకీయంగా వక్రీకరిస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానులే అయినప్పుడు, ఒక నిందితుడు తమ పార్టీ నేత కొడుకైనా, లేక ఓటు బ్యాంకుకు చెందిన ప్రముఖుడి కొడుకైనా శిక్ష ఒకేలా ఉండాలన్న కనీస ధర్మాన్ని వైసీపీ విస్మరిస్తోంది. బాధితురాలైన డాక్టర్ ప్రియాంక కుటుంబానికి న్యాయం జరగాలనే డిమాండ్ ఏపీవ్యాప్తంగా మిన్నంటుతున్న వేళ, వైసీపీ ద్వంద్వ వైఖరి ఆ పార్టీ విశ్వసనీయతను మరింత దిగజారుస్తోంది. సీదిరి అప్పలరాజు కేసులో బాధితుడికి ఒక న్యాయం, రాజమండ్రి కేసులో మరో న్యాయం అన్నట్లుగా రాజకీయాలు చేస్తున్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఫొటోస్ ఆఫ్ జెన్-గ్గ.. లోకేశ్ ట్వీట్ వైరల్




డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విపక్షం వైసీపీ చేస్తున్న ఆందోళనలపై మంత్రి నారా లోకేశ్ వ్యంగ్యంగా స్పందించారు. వైసీపీ తన ఆందోళనలకు జెన్-జీ వార్ అంటూ పేరు పెట్టగా, విపక్షం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో జెన్ జీ యువత ఎవరూ పాల్గొనడం లేదని అధికార పక్షం ఎదురుదాడి చేస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ తన అధికారిక ఎక్స్ లో వైసీపీ రిలే నిరాహారదీక్షల్లో కూర్చున్న వృద్ధులు, వయోజనుల ఫొటోను షేర్ చేస్తూ “ఫొటోస్ ఆఫ్ జెన్-గ్గ ఏ వైసీపీ ప్రొటెస్ట్స్” అంటూ ట్వీట్ చేశారు. తన ట్వీట్ కు నాలుగు ఫొటోలు జత చేయగా, అందులో ఒక్కరు కూడా యువకులు కనిపించలేదని ఆయన ఎద్దేవా చేశారు.వైసీపీ రిలే నిరాహారదీక్షలపై మంత్రి లోకేశ్ వ్యంగ్యంగా స్పందించడం వైరల్ అవుతోంది. వైసీపీ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై తొలి నుంచి భిన్నమైన ప్రచారమే జరుగుతోందని చెబుతున్నారు. డీఎస్సీ పరీక్షలు ముగిసిన ఏడాది తర్వాత వైసీపీ ఆందోళనలకు పిలుపునివ్వడం ఏంటని అని ప్రశ్నిస్తున్న అధికార పక్షం డీఎస్సీ రాసిన అభ్యర్థులు పెద్దగా స్పందించలేదన్న విషయాన్ని ఎత్తిచూపుతోంది. ఇదే సమయంలో వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరాల్లో వృద్ధులు, సీనియర్ కార్యకర్తలే ఎక్కువగా కనిపిస్తున్నారని అంటున్నారు.


ఈ నేపథ్యంలో డీఎస్సీ అక్రమాలపై జెన్-గ్గ లేవనెత్తుతున్న ప్రశ్నలకు తప్పక సమాధానం చెప్పాలంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేసిన ప్రకటనను ఏఎన్ఐ వార్తా సంస్థ ప్రచురించగా, ఆ క్లిప్ ను ట్యాగ్ చేస్తూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు. వైసీపీ నిరసనల్లో జెన్-గ్గ లేరన్న విషయాన్ని ఆయన నేరుగా ఎత్తిచూపారని అంటున్నారు. రాజకీయం కోసమే వైసీపీ ఆందోళనలు చేస్తుందనే విషయాన్ని చెప్పడానికి వృద్ధులు ఆందోళన చేస్తున్న ఫొటోను షేర్ చేశారని చెబుతున్నారు.కాగా, వైసీపీ రాజకీయ లక్ష్యంతో పెద్ద ఎత్తున నిరసన చేపట్టడాన్ని తప్పుపట్టకపోయినా, నిరసనలకు జెన్-గ్గ వార్ అంటూ పేరు పెట్టడంపైనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని అంటున్నారు. ఇదే సమయంలో మెగా డీఎస్సీ పరీక్ష రాసి ఉద్యోగాలలో చేరిన వారికి తాము వ్యతిరేకం కాదని వైసీపీ చెప్పలేకపోవడాన్ని పార్టీ నేతలు తప్పుబడుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లే క్రమంలో నిరసనలకు పెట్టిన పేరుతో మొత్తం విషయం పక్కదారి పట్టినట్లైందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే విషయాన్ని అధికార పక్షం పట్టుకుని తిరిగి వైసీపీపై రివర్స్ అటాక్ చేస్తోందని అంటున్నారు.

# తిరుపతి ఇప్పుడు ఈ-వీసా సెంటర్.. కేంద్రం కీలక నిర్ణయం




తిరుపతి విమానాశ్రయంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిదేళ్ల క్రితమే తిరుపతిని కేంద్రం అంతర్జాతీయ విమానాశ్రయంగా గుర్తించినప్పటికీ, ఇప్పటివరకు ఒక్క విదేశీ విమాన సర్వీసును ఇక్కడి నుంచి నడపలేదు. అయితే తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో త్వరలో తిరుపతి నుంచి విదేశీ ప్రయాణికుల రాకపోకలకు వీలు కల్పించనట్లుగా చెబుతున్నారు. తిరుపతి విమానాశ్రయానికి అధికారికంగా ఈ-వీసా ప్రవేశ కేంద్రం హోదాను కల్పిస్తూ తాజాగా కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఈ-వీసాలతో విదేశీయులు ప్రవేశించేందుకు వీలుగా అదనంగా 11 కొత్త కేంద్రాలను ప్రకటించగా, అందులో తిరుపతి ఎయిర్‌పోర్టును కూడా చేర్చారు.తిరుపతిని ఇ-వీసా హోల్డర్లకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రవేశ కేంద్రాల జాబితాలో చేర్చడంతో, తిరుమలను సందర్శించే విదేశీ పర్యాటకులకు ఇప్పుడు మరింత సులభమైన ప్రయాణ మార్గం లభించినట్లైందని అంటున్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చే విదేశీ భక్తులు ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు ఎయిర్ పోర్టుల్లో దిగాల్సివస్తోంది. అయితే ఇప్పుడు కేంద్రం ఇ-వీసాలు కలిగిన విదేశీయులు దేశంలోకి ప్రవేశించగల మరో 11 అంతర్జాతీయ పోర్టులను తాజాగా నోటిఫై చేయడంతో ఇకపై విదేశీ ప్రయాణికులు నేరుగా తిరుపతి ఎయిర్ పోర్టు ద్వారా దేశంలోకి ప్రవేశించే సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లైందని అంటున్నారు. కేంద్రం కొత్తగా నోటిఫై చేసిన జాబితాలో తిరుపతి, భోపాల్ విమానాశ్రయాలు ఉన్నాయి. అంతేకాకుండా తాజా నోటిఫికేషన్ తో ఇ-వీసా హోల్డర్లను దేశంలోకి అనుమతించే అంతర్జాతీయ పోర్టుల మొత్తం సంఖ్య 88కి పెరిగింది. ప్రస్తుత జాబితాలో ఇప్పుడు 37 విమానాశ్రయాలు, 38 ఓడరేవులు, 13 భూమార్గ పోర్టులు ఉన్నాయి.దేశం 2014లో 43 దేశాల పౌరుల కోసం ఈ-వీసా సౌకర్యాన్ని ప్రవేశపెట్టగా, ప్రస్తుతం ఇది 172 దేశాల పౌరులకు అందుబాటులో ఉంది. దాదాపు 95 శాతం ఇ-వీసా దరఖాస్తులు 72 గంటల్లోపే విజయవంతంగా ప్రాసెస్ చేయబడుతున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ఆమోదించబడిన ప్రవేశ మార్గాల జాబితాలో ఇప్పుడు తిరుపతి కూడా చేరడంతో, సమీప భవిష్యత్తులో విదేశాల నుంచి నేరుగా తిరుపతికి విమానాలు నడిచే అవకాశాలు బలపడుతున్నాయి. రాష్ట్రంలో విమానయాన కనెక్టివిటీని మరింత పెంచేందుకు, పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలలో ఈ నిర్ణయం ఒక కీలకమైన ముందుడుగుగా నిపుణులు భావిస్తున్నారు. చెల్లుబాటు అయ్యే ఈ-వీసాలు కలిగిన విదేశీ సందర్శకులకు భారతదేశంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక గమ్యస్థానాలలో ఒకటైన తిరుపతిని చేరుకోవడానికి ఈ పరిణామం అద్భుతమైన మార్గాన్ని సుగమం చేసిందని అంటున్నారు.ఇంతవరకు విదేశాల నుంచి వచ్చే యాత్రికులు నేరుగా తిరుపతికి రావడానికి అవకాశం ఉండేది కాదు. విదేశీ ప్రయాణికులు ముందుగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విమానాశ్రయాలలో దిగి, అక్కడి నుంచి రోడ్డు లేదా రైలు మార్గం ద్వారా తిరుపతికి చేరుకోవాల్సి వచ్చేది. తాజా నిర్ణయంతో విదేశీ భక్తులు నేరుగా చెల్లుబాటయ్యే ఈ-వీసాతో తిరుపతి విమానాశ్రయం ద్వారా దేశంలోకి ప్రవేశించడానికి మార్గం సుగమమైంది. త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తే ఈ ప్రయాణం మరింత సౌకర్యవంతం కానుందని చెబుతున్నారు. తిరుపతి విమానాశ్రయానికి 2008లోనే అంతర్జాతీయ హోదా లభించినప్పటికీ, 2017లో దీనిని అధికారికంగా నోటిఫై చేశారు. విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా వచ్చి సుమారు 9 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఒక్క రెగ్యులర్ అంతర్జాతీయ విమానం కూడా ఇక్కడ ల్యాండ్ కాలేదు. ఈ నేపథ్యంలో తాజా ఈ-వీసా ఆమోదం రావడం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది.

# పాక్ ప్రధాని షెహబాజ్ భయపడ్డారా? పీవోకేపై చర్చలకు అదే కారణమా?!



పాక్ ప్రధాని వెనక్కి తగ్గారు.. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే) నిరసనలపై తొలిసారి పెదవి విప్పారు. నిరసనలతో అట్టుడుకుతున్న పీవోకే ఆందోళనకారులతో చర్చించేందుకు సిద్ధమంటూ ఆసక్తికర ప్రకటన చేశారు. పీవోకేలో గత రెండు నెలలుగా నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, హింసాత్మక ఘటనల నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన తాజా ప్రకటన తీవ్ర చర్చకు దారితీస్తోంది. నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తామన్న ఆలోచన నుంచి వెనక్కి తగ్గిన పాక్ ప్రధాని, ఆందోళనకారులతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు చేసిన ప్రకటన సానుకూల పరిస్థితులకు అవకాశం కల్పించినట్లైందని అంటున్నారు.భగ్గుమంటున్న నిత్యావసరాల ధరలు, భారీగా పెరిగిన విద్యుత్ ఛార్జీలు, ప్రాంతీయ ఆర్థిక నిర్లక్ష్యం, వివాదాస్పద ఎన్నికల ప్రక్రియకు వ్యతిరేకంగా ‘జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ’ (జేఏఏసీ) ఆధ్వర్యంలో పీవోకే ప్రజలు పెద్ద ఎత్తున రోడ్డెక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కఠిన అణచివేత ధోరణిని అవలంబించిన పాక్ ప్రభుత్వం, అకస్మాత్తుగా చర్చల దిశగా అడుగులు వేయడం ప్రాధాన్యం సంతరించుకుందని చెబుతున్నారు. ఇక పీవోకే ఎన్నికల్లో తామే అధికారంలోకి రాబోతున్నామని, తమ పార్టీ ప్రభుత్వమే జేఏఏసీ ప్రతినిధులతో చర్చలు జరుపుతుందని, తద్వారా శాంతి ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని ప్రధాని షెహబాజ్ హామీ ఇచ్చారు. అయితే, శాంతియుతంగా సమస్యలను లేవనెత్తే వారికే ఈ అవకాశం ఉంటుందని, ప్రాంతంలో అరాచకాన్ని సృష్టించే శక్తులను మాత్రం ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. మరోవైపు పీఎంల్-ఎన్ సలహాదారు రానా సనాఉల్లా కూడా జేఏఏసీ సభ్యుల్లో 99 శాతం మంది దేశభక్తులేనని పేర్కొనడం గమనిస్తే ఆందోళనకారులతో రాజీకి పాక్ ప్రభుత్వం సిద్ధమవుతున్న సంకేతాలిస్తోందని అంటున్నారు.

### ఎన్నికల సమయంలో నెత్తుటిధారలు


ఇక పీవోకేలో మూడు దశల్లో జరుగుతున్న ఎన్నికలు హింసాత్మక ఘటనలకు వేదికగా మారాయని కథనాలు వస్తున్నాయి. బ్యాలెట్ బాక్సుల అపహరణ, రిగ్గింగ్ ఆరోపణలు, భద్రతా దళాల అణచివేతతో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. భారీగా ప్రాణనష్టం వాటిల్లినట్లు ప్రచారం జరుగుతోంది. జూన్ నుండి జరిగిన ఆందోళనల్లో సుమారు 400 మంది మరణించారని జేఏఏసీ ఆరోపిస్తుండగా, పాక్ ప్రభుత్వం మాత్రం ఈ లెక్కలను కొట్టిపారేస్తోంది. అయితే కొన్ని స్వతంత్ర సంస్థల నివేదికల ప్రకారం పీవోకేలో హింసాత్మక ఘర్షణల్లో సుమారు 80 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అంచనా వేస్తున్నారు. కాగా, ఆందోళనకారుల వెనుక టెహ్రిక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) వంటి ఉగ్రవాద సంస్థల హస్తం ఉందని పాక్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. దీంతో ఆందోళనకారుల మరణాలను సమర్థించుకునే ప్రయత్నం చేస్తోందని అంటున్నారు. అయితే అమ్నెస్టీ ఇంటర్నేషనల్, పాకిస్థాన్ మానవ హక్కుల కమిషన్ వంటి సంస్థలతో పాటు ఐక్యరాజ్యసమితి ఆందోళనకారులకు మద్దతుగా నిలుస్తున్నాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రజల హక్కులను కాపాడాలని, హింసాత్మక ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు, పాక్ ఆక్రమిత కాశ్మీర్ పూర్తిగా భారత్‌లో అంతర్భాగమని, పాకిస్థాన్ ఆ ప్రాంతాన్ని అక్రమంగా ఆక్రమించుకుందని భారత విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేస్తోంది.

# ‘వందేమాతరం’ మరో రికార్డు.. 80 ఏళ్ల స్వాతంత్ర్య ఉత్సవాల్లో ఫస్ట్ టైమ్ ఇలా...



కోట్లాది మంది భారతీయుల గుండెల్లో దేశభక్తిని రగిలించి, స్వాతంత్ర్య పోరాటంలో అద్భుతమైన స్ఫూర్తిని నింపిన మంత్రం ‘వందేమాతరం’. స్వాతంత్ర్య సమరయోధుల గొంతుకగా, మన దేశ గౌరవానికి ప్రతీకగా నిలిచిన ఈ అపురూప గీతం, ఇప్పుడు సరికొత్త చరిత్రను సృష్టించబోతోంది. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్న వేళ, ఢిల్లీలోని ఎర్రకోట ప్రాకారాల నుండి ఈ పవిత్ర గీతం తొలిసారిగా పూర్తిస్థాయిలో మార్మోగనుంది. ఇది మన జాతీయ వారసత్వాన్ని, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు గుర్తుచేసే ఒక గొప్ప గౌరవంగా చెబుతున్నారు.‘వందేమాతరం’ గేయం చరిత్రను పరిశీలిస్తే, 1875లో బంకించంద్ర ఛటర్జీ చేత రచించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో సమరయోధులలో పోరాట స్ఫూర్తిని రగిల్చిన గేయంగా వందేమాతరం గుర్తింపు పొందింది. అయితే, స్వాతంత్ర్య వేడుకల్లో ఎర్రకోట వేదికపై దీనిని ఈ స్థాయిలో ఆలపించడం ఇదే మొదటిసారి. 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ‘వందేమాతరం’ జాతీయ గేయంగా ప్రకటిస్తూ, జాతీయ గీతమైన ‘జనగణమన’తో సమానమైన గౌరవాన్ని కల్పించారు. ‘జనగణమన’ మన జాతీయ గీతంగా దేశ అధికారిక కార్యక్రమాల్లో ప్రధాన స్థానాన్ని పొందగా, ‘వందేమాతరం’ మన జాతీయ గేయంగా దేశభక్తికి, పోరాట స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది. ఇప్పుడు ఈ గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంలో, ఎర్రకోటపై దీనిని ఆలపించడం ఒక అరుదైన ఘట్టంగా అభివర్ణిస్తున్నారు.‘వందేమాతరం’ గేయం రూపుదిద్దుకుని 150 ఏళ్లు పూర్తవుతున్న చారిత్రక సందర్భంలో కేంద్ర ప్రభుత్వం వందేమాతరం గేయానికి సముచిత గౌరవాన్ని కల్పించిన విషయం తెలిసిందే. జాతీయ గౌరవ నిరోధక (సవరణ) బిల్లు ద్వారా వందేమాతరానికి జాతీయ గీతంతో సమానమైన చట్టపరమైన రక్షణను కల్పించింది. గేయంలోని ఆరు చరణాలను పూర్తిస్థాయిలో ఆలపించాలని స్పష్టం చేస్తూ, ప్రభుత్వ ప్రైవేటు సంస్థలన్నింటిలో ముందుగా వందేమాతరం, ఆ తర్వాత జనగణమన ఆలపించాలనే నిబంధనను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. తద్వారా, దేశభక్తిని ప్రతిబింబించే ప్రతి వేదికపై ఈ గేయానికి సముచిత స్థానం దక్కేలా చర్యలు తీసుకుంది.ఇక ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకల్లో యువతకు అగ్రతాంబూలం ఇవ్వడం మరో విశేషం. 2047 నాటికి ‘వికసిత భారత్’ లక్ష్యాన్ని చేరుకోవడంలో కీలకపాత్ర పోషించబోతున్న యువ మేధావులకు ఈ వేడుకల్లో అరుదైన అవకాశం దక్కింది. అంతర్జాతీయ ఒలింపియాడ్ పోటీల్లో ప్రతిభ చాటిన 19 మంది విద్యార్థులు ప్రధాని సమీపంలో ఆసీనులై ఉండగా, 2,500 మంది ఎన్‌సీసీ అభ్యర్థులు జ్ఞాన్ పథ్‌లో ‘వందేమాతరం’ అక్షర రూప విన్యాసాన్ని ప్రదర్శించడం ద్వారా దేశభక్తిని చాటనున్నారు.ఈ వేడుకలు కేవలం సాంస్కృతిక ప్రదర్శనలకు మాత్రమే పరిమితం కాకుండా, దేశ సమైక్యతకు, పర్యావరణ స్పృహకు ప్రతీకగా నిలవనున్నాయి. ‘మి-17’ హెలికాప్టర్ ద్వారా కురిపించనున్న పూల వర్షం, వివిధ రాష్ట్రాల సంప్రదాయ దుస్తుల్లో కనువిందు చేయనున్న 1,500 మంది ఢిల్లీ వాసులు, దేశ వైవిధ్యంలో ఏకత్వాన్ని ప్రతిబింబించనున్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఎర్రకోట వద్ద వీఐపీ ఎన్‌క్లోజర్లకు దేశంలోని ప్రముఖ సరస్సుల పేర్లు పెట్టడం ద్వారా, అభివృద్ధి మరియు ప్రకృతి మధ్య సమతుల్యతను చాటిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం మన జాతి చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.

# ‘నన్నే తీసేస్తారా..? ప్రకాశ్ రాజ్ సంచలన వ్యాఖ్యలు



ఒక రకంగా చెప్పాలంటే మన దేశంలో ప్రజాస్వామ్యం చాలా విచిత్రమైన మలుపులు తిరుగుతుంటుంది. నిన్నటిదాకా సామాన్యుల ఓట్లే గాల్లో కలిసిపోతున్నాయని అనుకుంటే ఇప్పుడు ఏకంగా సెలబ్రిటీల ఓట్లకు కూడా స్కెచ్ పడిపోతోంది. బెంగళూరు నగరం సాక్షిగా జరుగుతున్న ‘ప్రత్యేక సమగ్ర సవరణ’ మహోత్సవంలో భాగంగా ఏకంగా వర్సటైల్ నటుడు, కేంద్ర ప్రభుత్వంపై నిత్య విమర్శకుడు ప్రకాశ్ రాజ్ ఓటుకే ఎసరు పడింది. ఓటు పోయిందని బాధపడటం పక్కన పెడితే నాకే ఓటు లేకపోవడం ఏంట్రా బాబూ అని ఆయన నవ్వుకుంటూ వదిలిన సెల్ఫీ వీడియో ఇప్పుడు పొలిటికల్ సర్క్యూట్‌లో సరికొత్త సెటైర్ల వర్షం కురిపిస్తోంది .బెంగళూరు నగరంలో దాదాపు 65 లక్షల ఓట్లను ఊడదీశారని వార్తలు వస్తుంటే అందులో తన ఓటు కూడా ఉండటం చూసి ప్రకాశ్ రాజ్ అవాక్కయ్యారు. అసలు ఈ నగరంతో తనకున్న బంధం ఎలాంటిదో ఆయన చాలా సరదాగా విడమరిచి చెప్పారు. బెంగళూరులోనే పుట్టాను.. ఇక్కడే పెరిగాను.. ఇక్కడే చదువుకున్నాను.. ఆఖరికి యాక్టింగ్ నేర్చుకుని.. మొన్నటికి మొన్న ఇదే ఊరి నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశాను సార్.. అలాంటి నాకే బెంగళూరులో ఓటు లేదంటే.. నాకంటే పెద్ద ఎన్ఆర్ఐ లేదా విదేశీయుడు ఇంకెవడైనా ఉంటాడా అని ఆయన వేసిన సెటైర్లు మామూలుగా లేవు. మళ్లీ ఓటు తెచ్చుకోవడానికి ఏమేం సర్టిఫికెట్లు అడుగుతారో ఏ క్యూలో నిలబెడతారో చూద్దాం, నేను దేనికైనా రెడీ అంటూ సవాల్ విసిరారు.అక్కడితో ఆగితే ఆయన ప్రకాశ్ రాజ్ ఎందుకవుతారు? అసలైన పంచ్ డైలాగ్ ప్రధాని మోదీ వైపే విసిరారు. “మీకు ఓటు వేయరు అని అనుమానం ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటర్ల జాబితా నుంచి తుడిచేసే పవర్ మీ దగ్గర ఉండుండొచ్చు. కానీ అసలు మిమ్మల్ని గద్దె దింపకుండా మమ్మల్ని ఆపగలరా?” అంటూ మోదీజీకి నేరుగా ‘గేమ్ ఆన్’ మెసేజ్ ఇచ్చేశారు. అధికారం చేతిలో ఉంది కదా అని ఓట్లను గాల్లో కలిపేస్తే.. ప్రజలు తమ ఆలోచనలను మార్చుకుంటారని అనుకోవడం అమాయకత్వమేనని ఆయన మార్కు వ్యంగ్యంతో ఎండగట్టారు.

అయితే నాణేనికి ఇంకో వైపు చూస్తే లీగల్ కష్టాలు కూడా తక్కువేమీ లేవు. గతంలో ప్రకాశ్ రాజ్‌కి ఒక్క రాష్ట్రంలో కాదు.. ఏకంగా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో సహా నాలుగు రాష్ట్రాల్లో ఓటర్ కార్డులు ఉన్నాయంటూ పెద్ద రగడే నడిచింది. ఈ నాలుగు కార్డుల వ్యవహారంలో బెంగళూరు కోర్టు నుంచి నోటీసులు వస్తే స్పందించలేదని.. ఆమధ్య నాన్-బెయిలబుల్ వారెంట్ కూడా జారీ అయింది. చివరికి జులైలో కోర్టు మెట్లు ఎక్కి.. లాయర్ల వాదనలు వినిపించాక గానీ ఆయనకు బెయిల్ దక్కలేదు.ఒకే మనిషికి నాలుగు రాష్ట్రాల్లో ఓటు ఉంటే తీసేయడం విధి నిర్వహణా? లేక నిజంగానే ప్రకాశ్ రాజ్ సంచలన ఆరోపణలు చేసినట్టు ప్రతిపక్షాల, విమర్శకుల ఓట్ల ఏరివేతా? అనేది పక్కన పెడితే.. ప్రకాశ్ రాజ్ వదిలిన ఈ సెల్ఫీ బాంబు మాత్రం సోషల్ మీడియాలో విపరీతంగా పేలుతోంది. అధికారులు దీనిపై ఎలాంటి కవరింగ్ ఇస్తారో ఈ ‘ఓటు తీసివేత’ ఎపిసోడ్ ఇంకెన్ని పొలిటికల్ ట్విస్టులు తీసుకుంటుందో చూడాలి.

## గోప్యతకు గండి!


కళ్లజోడు ధరించడం సాధారణ విషయం. కానీ ఆ కళ్లజోడే మన కంటికి కనిపించే ప్రతి దృశ్యాన్నీ రహస్యంగా చిత్రీకరిస్తే? మనం మాట్లాడే ప్రతి మాటనూ రికార్డు చేస్తే? ఇది భవిష్యత్తు కథ కాదు, వర్తమాన వాస్తవం! కృత్రిమ మేధ, అధునాతన సెన్సర్లు, హై-రిజల్యూషన్ కెమెరాలతో కూడిన స్మార్ట్ కళ్లజోళ్లు ఇప్పుడు మార్కెట్‌లో అందుబాటులోకి వస్తున్నాయి. ధరించిన వ్యక్తి చూసే ప్రతి దృశ్యాన్నీ ఫొటోలుగా, వీడియోలుగా బంధించడం, పాడ్‌కాస్ట్‌లు, సంగీతం వినిపించడం, మైక్రోఫోన్ల ద్వారా చుట్టుపక్కల శబ్దాలను రికార్డు చేయడం, స్పీకర్ల సాయంతో ఫోన్‌కాల్స్ మాట్లాడటం -ఇవన్నీ ఈ కళ్లజోళ్లు అవలీలగా చేసేస్తాయి. సేకరించిన సమాచారమంతా పరికరం మెమొరీలో నిక్షిప్తమై, స్మార్ట్‌ఫోన్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునేలా రూపొందించారు. సాంకేతికంగా చూస్తే ఇది అద్భుతమైన ఆవిష్కరణే. కానీ ఈ సౌలభ్యం వెనుక దాగివున్న ప్రమాదమే అసలు చర్చనీయాంశం. ఎందుకంటే, ఈ పరికరాలు సాధారణ కళ్లజోళ్లలా కనిపిస్తూ, ఎదుటివారికి తెలియకుండానే వారిని రికార్డు చేయగలవు. దీన్ని ఒక చిన్న ఎల్‌ఈడీ లైటు మినహా గుర్తించే మార్గం లేదు. అదికూడా తేలికగా కప్పిపుచ్చవచ్చు. అమెరికాలో మెటా సంస్థ తయారుచేసిన రే-బాన్ మెటా కళ్లజోళ్లపై ఐర్లాండ్ డేటా ప్రొటెక్షన్ కమిషన్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో, ఎల్‌ఈడీ లైటు పరిమాణాన్ని పెంచి, మిణుకుమిణుకుమనేలా మార్చాల్సి వచ్చింది. అయినా, అది సరిపోతుందా అన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకమే! సాంకేతికత అభివృద్ధి చెందుతున్న వేగానికి, దాన్ని నియంత్రించే చట్టాల రూపకల్పన వేగం సరిపోలడం లేదన్నదే అసలు సమస్య.

ఈ ప్రమాదం కేవలం ఊహాజనితం కాదని ఇప్పటికే పలు సంఘటనలు రుజువు చేశాయి. 2024లో అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఇద్దరు 'ఐ-ఎక్స్‌రే' అనే ఒక పరికరాన్ని రూపొందించారు. రే-బాన్ మెటా కళ్లజోళ్లను కృత్రిమ మేధతో, బహిరంగంగా అందుబాటులో ఉన్న డేటాబేస్‌లతో అనుసంధానం చేసి, కేవలం ఒక్క నిమిషంలో ఎదుటివారి ముఖాన్ని చూసి వారి పేరు, చిరునామా, ఇతర సున్నితమైన వ్యక్తిగత వివరాలను రాబట్టగలిగారు. ఈ ప్రయోగంలో సొంత సహవిద్యార్థుల వివరాలను సైతం వారికి తెలియకుండానే సేకరించారు. ఇది కేవలం ఒక సాంకేతిక ప్రదర్శన మాత్రమే కాదు, స్మార్ట్ కళ్లజోళ్లు ఎంతటి ప్రమాదకర ఆయుధంగా మారగలవో చూపించిన హెచ్చరిక. ఇదే సాంకేతికతను దురుద్దేశపూరితంగా వాడితే, వీధుల్లో నడుస్తున్న అపరిచితుల వివరాలను క్షణాల్లో సేకరించి, స్టాకింగ్, వేధింపులు, డాక్సింగ్‌వంటి నేరాలకు పాల్పడే అవకాశం ఉంది. 'కోతికి కొబ్బరికాయ దొరికినట్టు', సరైన అవగాహన, బాధ్యత లేని వ్యక్తుల చేతికి ఇలాంటి శక్తిమంతమైన సాంకేతిక పరికరాలు అందితే, దాని పర్యవసానాలు అనూహ్యం. మహిళలను, చిన్నారులను రహస్యంగా చిత్రీకరించి వేధించడం, ఆ దృశ్యాలను దురుద్దేశంతో ఎడిట్ చేసి సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చేయడం, కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు తమ సంస్థల రహస్య సమాచారాన్ని, బ్యాంకు ఖాతాల వివరాలను తస్కరించే ప్రమాదం ఉంది. ఇటీవల స్వీడన్‌లో ఒక పరిశోధనాత్మక కథనం ద్వారా వెలుగులోకి వచ్చిన మరో సంచలన విషయం ఏమిటంటే, మెటా సంస్థ తన కృత్రిమ మేధ శిక్షణ కోసం, వినియోగదారుల కళ్లజోళ్ల ద్వారా రికార్డైన ప్రైవేటు ఫుటేజీని కెన్యాలోని ఒక ఉప సంస్థకు మానవ సమీక్ష కోసం పంపిస్తున్నట్టు తేలింది. అంటే, వినియోగదారుడు తనకు తెలియకుండానే తన అత్యంత వ్యక్తిగత క్షణాలను ప్రపంచంలో మరెక్కడో ఉన్న అపరిచితుల కళ్లముందు ఉంచుతున్నాడన్నమాట. ఈ వెల్లడి అనంతరం అమెరికాలో మెటాపై, దాని భాగస్వామ్య సంస్థపై క్లాస్ యాక్షన్ దావా కూడా దాఖలైంది.

ఈ ముప్పును గుర్తించిన పలు దేశాలు, సంస్థలు ఇప్పటికే నివారణ చర్యలు మొదలుపెట్టాయి. ఐరోపా సమాఖ్యలో ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాలు స్మార్ట్ కళ్లజోళ్లపై నిషేధం విధించే యోచనలో ఉన్నాయి. అమెరికాలో ఎలక్ట్రానిక్ ప్రైవసీ ఇన్ఫర్మేషన్ సెంటర్ వంటి సంస్థలు, ఫెడరల్ ట్రేడ్ కమిషన్‌తోపాటు పలు రాష్ట్రాల అటార్నీ జనరళ్లకు లేఖలు రాస్తూ, ముఖ గుర్తింపు సాంకేతికతను ఈ కళ్లజోళ్లలో పొందుపరచకుండా అడ్డుకోవాలని కోరుతున్నాయి. కొన్ని అమెరికా న్యాయస్థానాలు తమ కోర్టు గదుల్లో ఇలాంటి కళ్లజోళ్లను ధరించి చిత్రీకరించడాన్ని నిషేధించగా, న్యూయార్క్ రాష్ట్రంలో మొత్తం న్యాయవ్యవస్థ పరిధిలోనే వీటిపై నిషేధం అమల్లోకి వచ్చింది. సైనిక దళాల్లోనూ విధుల్లో ఉన్నప్పుడు ఫొటో, వీడియో, కృత్రిమ మేధ సామర్థ్యం కలిగిన కళ్లజోళ్లు ధరించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రార్థనా స్థలాలు వంటి సున్నితమైన ప్రాంతాల్లో ఈ పరికరాలను నిషేధించాలన్న డిమాండ్లు కూడా ఊపందుకుంటున్నాయి. చిన్నారుల భద్రతపై ఆందోళన చెందుతున్న హక్కుల సంఘాలు, కుటుంబ అనుకూల వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా ఈ కళ్లజోళ్లను తమ ప్రాంగణాల్లోకి అనుమతించొద్దని పిలుపునిస్తున్నాయి. అమెరికాలో రాష్ట్రాలవారీగా రికార్డింగ్ సమ్మతి చట్టాలు వేర్వేరుగా ఉండటం, కొన్ని రాష్ట్రాల్లో ఇరు పక్షాల సమ్మతి తప్పనిసరి కావడం వంటివి ఉన్నా, ఎల్లప్పుడూ ఆన్‌లో ఉండే ధరించదగిన కృత్రిమ మేధ పరికరాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సమగ్ర సమాఖ్య చట్టం అమెరికాలో ఇప్పటికీ లేకపోవడం గమనార్హం. మన దేశంలో పరిస్థితి మరింత ప్రమాదకరం. ఇలాంటి పరికరాలపై స్పష్టమైన నియంత్రణ, లైసెన్సింగ్ వ్యవస్థ లేకపోవడం వల్ల, ఎవరైనా వీటిని కొనుగోలు చేసి ఇష్టానుసారం వాడుకునే అవకాశముంది. సాంకేతిక పురోగతిని ఆపలేం, ఆపకూడదు కూడా. కానీ ఆ పురోగతి సామాన్యుడి గోప్యతను హరించే ఆయుధంగా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. రికార్డింగ్ జరుగుతున్నప్పుడు స్పష్టమైన, తప్పించుకోలేని సూచికలు తప్పనిసరి చేయడం, బహిరంగ ప్రదేశాల్లో ముఖ గుర్తింపు సాంకేతికతను నిషేధించడం, సున్నితమైన ప్రాంతాల్లో వినియోగాన్ని పరిమితం చేయడం, ఉల్లంఘనలకు కఠిన శిక్షలు విధించడం వంటి చర్యలు తక్షణావసరం. ఐరోపా దేశాలు, అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు చేపడుతున్న చర్యలను మార్గదర్శకంగా తీసుకుని, భారత్ కూడా ఇప్పుడే అప్రమత్తం కాకపోతే, రేపటి రోజున ఈ సాంకేతికత సృష్టించే గోప్యతా సంక్షోభాన్ని ఎదుర్కోవడం మరింత కష్టతరమవుతుంది. టెక్నాలజీ మనకు ఉపయోగపడాలే తప్ప, మనపైనే నిఘా పెట్టే సాధనంగా మారకూడదు అన్నదే ఈ చర్చనుంచి తీసుకోవాల్సిన అసలైన గుణపాఠం!!

---

### పనికొచ్చే పలుకు



## చిన్న లక్ష్యాలే.. అసలైన వైఫల్యామా?

గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి భయపడి, చిన్న విజయాలతో సరిపెట్టుకోవడంవల్ల కలిగే నష్టాలపై ప్రముఖ అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ లెస్ బ్రౌన్ ఆసక్తికర విశ్లేషణ చేశారు. పరిమితులను దాటి పెద్ద కలలు కనడం ఎంత అవసరమో ఆయన విశ్లేషణలో ధ్వనిస్తుంది. జీవితంలో ఓటమికి అసలు కారణమేమిటి? ఆశించిన ఫలితాలు రాకపోవడమా? లేక మన ఆలోచనా పరిధి చిన్నది కావడంవల్లా? దీనిపై లెస్ బ్రౌన్ చెప్పిన ఒక వాక్యం లక్షలాది మంది ఆలోచనా విధానాన్ని మార్చివేసింది. "చాలా మంది జీవితంలో విఫలం కావడానికి కారణం.. వారు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించలేకపోవడం కాదు.. చాలా చిన్న లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సులువుగా సాధించి అక్కడే ఆగిపోవడం" అంటాడు లెస్ బ్రౌన్. లెస్ బ్రౌన్ తన ప్రసంగాలు, పుస్తకాల ద్వారా ఆత్మన్యూనతా భావాన్ని జయించి, సామర్థ్యాన్ని ముమ్మరంగా ఎలా ఉపయోగించుకోవాలో ప్రపంచానికి వివరించారు. ఈ ప్రసిద్ధ వ్యాఖ్య ఎప్పుడు, ఎక్కడ చెప్పారో ఖచ్చితమైన వివరాలు లేనప్పటికీ, ఆయన ప్రసంగాల్లో ఇది ఎప్పుడూ అత్యంత ప్రభావవంతమైన మాటగా నిలిచింది. మనకున్న ప్రతిభ లేదా అవకాశాల కొరత కంటే, మనల్ని మనం తక్కువగా అంచనా వేసుకోవడమే అతిపెద్ద ఆటంకమని ఈ మాట స్పష్టం చేస్తోంది.

కంఫర్ట్ జోన్ వర్సెస్ ఆశయం

సాధారణంగా అసాధ్యమైన లక్ష్యాలను ఎంచుకోవడం వల్లే మనుషులు విఫలమవుతారని అందరూ భావిస్తారు. కానీ లెస్ బ్రౌన్ ఈ ఆలోచనను సవాలు చేశారు. ఎలాంటి శ్రమ, ధైర్యం అవసరం లేని సాధారణ లక్ష్యాలతో సరిపెట్టుకోవడమే అసలైన వైఫల్యమని ఆయన వాదించారు. సులభంగా సాధించగలిగే లక్ష్యాలు తాత్కాలికంగా సంతృప్తిని ఇవ్వవచ్చు. కానీ, కాలక్రమేణా 'ఇంకా పెద్దగా కలలు కని ఉంటే బాగుండేది' అనే పశ్చాత్తాపం మిగిలిపోతుంది. పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకున్నప్పుడు వైఫల్యం చెందే ప్రమాదం ఉన్నప్పటికీ, ఆ ప్రయాణమే మనుషులను కొత్త విషయాలు నేర్చుకునేలా, తమలో దాగి ఉన్న శక్తులను గుర్తించేలా చేస్తుంది. లెస్ బ్రౌన్ ఉద్దేశం ఓటమిని పొగడటం కాదు, పరిమితులను దాటి ఆలోచించే ధైర్యాన్ని నూరిపోయడమే!

ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, ఓటమిపట్ల భయం, సోషల్ మీడియాలో ఇతరులతో పోల్చుకోవడం, తక్షణ గుర్తింపు కోసం పాకులాడటం వంటివి మనుషులను పెద్ద రిస్క్‌లు తీసుకోకుండా అడ్డుకుంటున్నాయి. కెరీర్ ఎంపిక, వ్యాపారం ప్రారంభించడం, ఉన్నత చదువులు లేదా కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడంలో చాలామంది సురక్షితమైన మార్గాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే కంఫర్ట్ జోన్ సరిహద్దుల్లో ఎదుగుదల సాధ్యం కాదని లెస్ బ్రౌన్ మాటలు గుర్తుచేస్తున్నాయి. సైన్స్, వ్యాపారం, క్రీడలు, కళారంగాల్లో సాధించిన గొప్ప పురోగతులన్నీ ఒకప్పుడు 'అసాధ్యం' అనిపించిన లక్ష్యాలనుంచే పుట్టుకొచ్చాయి.

ఈ సందేశం విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులకు అద్భుతమైన మార్గదర్శిగా నిలుస్తుంది. ఆలోచించి తీసుకునే రిస్క్‌లను స్వాగతించాలని, ఎదురుదెబ్బలను ఓటములుగా కాకుండా పునాది రాళ్లుగా భావించాలని ఇది నేర్పుతుంది. కేవలం అంతిమ ఫలితాన్ని బట్టి కాకుండా, పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకునే ధైర్యాన్ని బట్టి విజయాన్ని కొలవాలి. మన పరిమితులను దాటి శ్రమించినప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఒకవేళ నిర్దేశించుకున్న పెద్ద లక్ష్యాన్ని పూర్తిగా సాధించలేకపోయినా, ఆ ప్రయాణంలో పొందే జ్ఞానం, సహనం, ఆత్మవిశ్వాసం జీవితాంతం ఉపయోగపడతాయి. అందుకే పెద్ద కలలు కనడానికి, ధైర్యంగా అడుగులు వేయడానికి ఎప్పుడూ వెనుకాడకూడదు.

---

# మెట్టు దిగిన మొండితనం!?

ఐదు నెలలుగా సాగుతున్న అమెరికా-ఇరాన్ యుద్ధంలో ట్రంప్ వైఖరి గణనీయంగా మారింది. అణ్వాయుధ రహిత ఇరాన్ డిమాండ్‌ను పక్కనబెట్టి, కేవలం హర్మూజ్ జలసంధి తెరిచే ఒప్పందంతోనే యుద్ధాన్ని ముగించేలా ఉన్నారు. క్షిపణి నిల్వల తగ్గుదల, చమురు ధరలు పెరుగుదల, నవంబరు మధ్యంతర ఎన్నికల ఒత్తిడి, సౌదీ, యూఏఈ, ఖతార్‌వంటి మిత్రదేశాల జోక్యం -ఈ నాలుగు అంశాలే ట్రంప్‌ను వంచేశాయి. మరోవైపు, షరతులు లేకుండా జలసంధి తెరవాలన్న అమెరికా డిమాండ్‌కు ఇరాన్ ససేమిరా అంటూ, బలగాలు వైదొలగాలని పట్టుబడుతోంది. హూతీల ఎర్ర సముద్ర దిగ్బంధనం, ఇరాన్ హెచ్చరికలతో ఉద్రిక్తతలు ఇంకా సద్దుమణగలేదు. దీంతో.. ఇప్పుడు పాక్షిక ఒప్పందంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితికి రావడం గమనార్హం. అతిగా వ్యవహరిస్తే చివరకు వెనక్కి తగ్గక తప్పదన్న సత్యానికి ఇది మరోసారి నిదర్శనం.




'అతి సర్వత్ర వర్జయేత్' అన్నది సూక్తి మాత్రమే కాదు, రాజనీతిలో శాశ్వత సత్యం కూడా. ఎంతటి అధికారమైనా, ఎంతటి పట్టుదలైనా హద్దు మీరితే అది తనకే ఎదురుతిరుగుతుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విషయంలో సరిగ్గా ఇదే జరుగుతోంది. ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించినప్పటి నుంచీ 'అణ్వాయుధ రహిత ఇరాన్' అన్న డిమాండ్‌పై మొండిగా నిలబడిన ట్రంప్, ఏప్రిల్ నెలలో "ఈ రాత్రి ఒక నాగరికతే అంతమవుతుంది" అంటూ టెహ్రాన్‌ను హెచ్చరించే స్థాయికి వెళ్లారు. అయితే ఐదు నెలలు గడిచేసరికి పరిస్థితి పూర్తిగా తారుమారైంది. అణు ఒప్పందం అంశాన్ని పక్కనబెట్టి, కేవలం హర్మూజ్ జలసంధి తెరిచే ఒప్పందంతోనే యుద్ధాన్ని ముగించేందుకు సిద్ధపడుతున్నట్టు అమెరికా మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇది కేవలం దౌత్యపరమైన వెనుకడుగు కాదు, ట్రంప్ మొదటినుంచీ అనుసరిస్తూ వచ్చిన 'గరిష్ఠ ఒత్తిడి' వ్యూహం విఫలమైందనేందుకు స్పష్టమైన సంకేతం. ఏప్రిల్‌లో మొదలైనప్పటి నుంచి ఈ యుద్ధంలో ట్రంప్ ఇచ్చిన హెచ్చరికలు, పెట్టిన గడువులు అనేకసార్లు మారాయి. రెండు వారాల కాల్పుల విరమణలు ప్రకటించడం, అవి కూలిపోవడం, మళ్లీ దాడులకు సిద్ధపడటం, చివరి నిమిషంలో వెనక్కి తగ్గడం -ఈ చక్రం పదేపదే కొనసాగింది. జూన్‌లో కుదిరిన ఒక అవగాహన ఒప్పందం కుప్పకూలిన తర్వాత అమెరికా మళ్లీ నౌకా దిగ్బంధనాన్ని అమల్లోకి తెచ్చింది. దీని కింద అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే 44 వాణిజ్య నౌకలను దారి మళ్లించి, రెండింటిని నిర్వీర్యం చేసి, మరో రెండింటిని తనిఖీ చేసినట్టు వెల్లడించింది. ఈ పరిణామాలన్నీ యుద్ధం ఎంతగా సంక్లిష్టమైందో, ఎంతగా చేజారిపోయిందో స్పష్టం చేస్తున్నాయి.

ట్రంప్ వైఖరి మారడం వెనుక ఒకటి కాదు, అనేక అంశాలు ఒకేసారి ఒత్తిడి తెస్తున్నాయి. మొదటిది, ఆయుధ నిల్వల సంక్షోభం. ఐదు నెలలుగా సాగుతున్న యుద్ధంలో అమెరికా క్షిపణి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. యుద్ధానికి ముందు 2,330 ఉన్న పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్లు ఇప్పుడు 827కు, 452 ఉన్న థాడ్ ఇంటర్‌సెప్టర్లు 232-262కు పడిపోవడం గమనార్హం. ఇది యుద్ధానికి ముందున్న నిల్వకంటే 38 శాతం తక్కువ. ఉత్పత్తిని వేగవంతం చేయాలని రక్షణ శాఖ ఉప మంత్రి స్టీవ్ ఫీన్‌బెర్గ్ ఆయుధ కంపెనీలపై ఒత్తిడి తెచ్చినా, తక్షణ పరిష్కారం కనిపించడం లేదు. క్షిపణులు తగ్గిపోతున్న కొద్దీ, ఒక్క డ్రోన్ లేదా క్షిపణి తప్పించుకుని వచ్చినా అది పెను ప్రమాదానికి దారితీయవచ్చని వాషింగ్టన్‌లోని వ్యూహాత్మక అధ్యయనాల కేంద్రం హెచ్చరిస్తోంది. ట్రంప్ మాత్రం బహిరంగంగా కొరతను ఒప్పుకోకుండా, అవసరమైతే నౌకల్లో ఆయుధాలు వస్తాయని సమర్థించుకుంటున్నా, రక్షణ బడ్జెట్‌ను 90,000 కోట్ల డాలర్ల నుంచి 1,50,000 కోట్ల డాలర్లకు పెంచే బిల్లుకు కాంగ్రెస్‌లో మద్దతు లభించకపోవడం అసలు వాస్తవాన్ని బయటపెడుతోంది. రెండోది, ఆర్థిక ఒత్తిడి. హర్మూజ్‌లో నౌకా రవాణా స్తంభించడంతో చమురు ధరలు తగ్గకపోగా, ఇరాన్‌పై దాడులు వాయిదా వేసిన వెంటనే ధరలు పడిపోవడం గమనార్హం. ఇది ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న అమెరికా ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్న అంశం. మూడోది, రాజకీయ ఒత్తిడి. నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరగనున్న తరుణంలో, సుదీర్ఘ యుద్ధంపై సొంత పార్టీలోనే వ్యతిరేకత పెరుగుతోంది. ఎన్నికలకు ముందు మరో యుద్ధభారాన్ని మోయడం రాజకీయంగా నష్టదాయకమని ట్రంప్‌కు స్పష్టమైంది. నాలుగోది, మిత్రదేశాల ఒత్తిడి. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్‌లతోపాటు పాకిస్తాన్ కూడా పలుమార్లు జోక్యం చేసుకుని దాడులను వాయిదా వేయించడం ట్రంప్ స్వతంత్ర నిర్ణయాధికారంపై పరిమితులు విధించింది. ఈ నాలుగు అంశాలు కలిసి, మొదట్లో అత్యంత కఠినంగా వ్యవహరించిన ట్రంప్‌ను ఇప్పుడు రాజీ దిశగా నెట్టివేశాయి.

అయితే ఇరాన్ వైపునుంచి చూస్తే పరిస్థితి పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. హర్మూజ్ జలసంధిని షరతులు లేకుండా తెరవాలన్న అమెరికా డిమాండ్‌కు టెహ్రాన్ ససేమిరా అంటోంది. దిగ్బంధనం ఎత్తివేయాలని, ప్రాంతం నుంచి అమెరికా బలగాలు వైదొలగాలని, యుద్ధాన్ని శాశ్వతంగా ముగించే వరకూ జలసంధిని తెరవబోమని ఇరాన్ కరాఖండీగా చెబుతోంది. ఒమన్‌తో కలిసి ఒక తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నా, అమెరికాతో నేరుగా చర్చలు జరుగుతున్నాయన్న వాదనను ఇరాన్ విదేశాంగ శాఖ ఖండిస్తూనే ఉంది. తాము కేవలం ఒమన్‌తోనే హర్మూజ్ అంశంపై సంప్రదింపులు జరుపుతున్నామని, జూన్‌లో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించింది అమెరికానేనని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. ఇరాన్ నియంత్రణలో ఉన్న మార్గం మినహా మరే ఇతర మార్గంలోనూ నౌకలను అనుమతించమని, అమెరికా యుద్ధనౌకలు అక్రమ మార్గంలో ప్రవేశిస్తే లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, ఇరాన్ మద్దతున్న యెమెన్ హూతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలో దిగ్బంధనం ప్రకటించడంతో, సౌదీ నౌకలు ఆఫ్రికా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఇది ప్రయాణ సమయాన్ని కనీసం రెండు వారాలు పెంచుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా బలగాలు తమ గడ్డపై అడుగుపెడితే తీవ్ర పరిణామాలు తప్పవని ఇరాన్ బ్రిగేడియర్ జనరల్ అలీ జహన్‌షాహీ మరోసారి హెచ్చరించారు. ఒకవైపు ఆయుధాలు తరిగిపోతూ, మరోవైపు దేశీయ రాజకీయ ఒత్తిడి పెరుగుతున్న తరుణంలో, తాను తలపెట్టిన 'సంపూర్ణ విజయం' లక్ష్యాన్ని పక్కనబెట్టి, పాక్షిక ఒప్పందంతో సరిపెట్టుకోవడానికి ట్రంప్ మొగ్గు చూపడం అనివార్యమైన పరిణామమే. మొదట్లో బేషరతుగా లొంగిపోవాలని డిమాండ్ చేసిన అమెరికా, ఇప్పుడు దశలవారీగా రాజీపడాల్సిన పరిస్థితికి రావడం, అతిగా వ్యవహరిస్తే చివరకు వెనక్కి తగ్గక తప్పదన్న సత్యానికి నిదర్శనం. ఈ యుద్ధం ఎలా ముగుస్తుందన్నది కాలమే నిర్ణయిస్తుంది, కానీ తొలినాళ్ల మొండి వైఖరి నుంచి నేటి రాజీ దృక్పథానికి ట్రంప్ ప్రయాణం మాత్రం అంతర్జాతీయ రాజకీయాల్లో అధికార పరిమితులకు ఒక కీలక పాఠంగా మిగిలిపోనుంది! ■

---



తిరస్కారానికి భయపడి మనల్ని మనమే తిరస్కరించుకుంటాం. ఎదుటివారు 'నో' చెప్పకముందే, మనసులో ఓటమిని డిసైడ్ చేసేస్తాం. ప్రయత్నించే ధైర్యం, మన సామర్థ్యాన్ని అంచనా వేసుకోగలిగే సత్తా లేకపోవడమే ఇందుకు కారణం. ఫలితంగా, చేతికందే విజయాలను చేజేతులారా జారవిడుచుకుంటాం. గుర్తుంచుకోండి -నిరాకరణ జస్ట్ అభిప్రాయమే. అంతిమ తీర్పు కాదు. ప్రయత్నించి ఓడిపోవడంలో నీకో స్థానముంటుంది. తలుపు తట్టకుండానే.. లోపలివాళ్లు తీయరనుకుంటే ఎలా? మీ శక్తిని మీరే శంకించొద్దు. అడుగేయండి.. -కనీసం ప్రయత్నించిన తృప్తి ఉంటుంది. అదే తరువాత గెలుపవుతుంది.

-మహాదేవ

---

### వింతల్లో వింతలు

## సిక్కడాలతో ఎకసెక్కాలొద్దు!



చైనా జెజియాంగ్ ప్రావిన్స్ నింగ్‌బోలో 18 ఏళ్ల కుర్రాడు క్యాంపింగ్‌కు వెళ్లి, వందలాది జీవులు (సిక్కడాలు) చేసే గోలలో నాలుగు గంటలకు పైగా గడిపాడు. అంతే.. చెవుల్లో మోత, మూసుకుపోయిన అనుభూతి మొదలై చిన్ని శబ్దాలు కూడా వినిపించడం మానేశాయి. ఆసుపత్రికి పరుగెడితే.. రెండు చెవులూ వాచిపోయాయన్నారు వైద్యులు. మందులిచ్చి, రెండు వారాలు గట్టి శబ్దాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదృష్టవశాత్తూ కుర్రాడు కోలుకున్నాడు. ఒక్క సిక్కడా శబ్దం 70 డెసిబెల్స్ దాటకున్నా.. గుంపుగా అరిస్తే 85 డెసిబెల్స్ దాటి చెవులకు హాని కలిగించే స్థాయికి చేరుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువసేపు గట్టి శబ్దాలకు గురైతే చెవిలోని కణాలు ఉబ్బిపోయి, విశ్రాంతితో సాధారణంగా తగ్గిపోతాయి కానీ, కణాలు చనిపోతే మాత్రం వినికిడి శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు తెలిపారు.

# టాటూలు వేయించుకోవడం సురక్షితమేనా?... నిపుణులు ఏం చెబుతున్నారంటే...!



పది మందిలో ప్రత్యేకంగా కనిపించాలనే మనస్తత్వం ఉన్న వాళ్లు టాటూలు వేయించుకుంటారు. అయితే, టాటూలు వేయించుకోవడం సురక్షితమేనా అనే అంశం చాన్నాళ్లుగా చర్చనీయాంశంగా ఉంది. టాటూలు వేసేందుకు ఉపయోగించే సూదులు అపరిశుభ్రంగా ఉండడం, ఒకరికి వాడిన సూదులు మరొకరికి వాడడం వంటి కారణాలతో హెచ్ఐవీ, హెపటైటిస్ వంటి వైరస్ లు వ్యాపించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో, నిపుణులు ఏం చెబుతున్నారో ఓసారి చూద్దాం.

**టాటూ వేయించుకునే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు**

శరీరంపై టాటూ వేయించుకోవాలనుకునే ప్రదేశంలో వారం ముందు నుంచి మాయిశ్చరైజర్ రాయడం ప్రారంభించాలి.

చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి తగినంత నీరు త్రాగాలి.

టాటూ వేయించుకునే నాలుగు రోజుల ముందు వరకు ఆ ప్రాంతంలో వాక్సింగ్ లేదా ఎపిలేషన్ చేయకూడదు.

సూర్యరశ్మి నుంచి చర్మాన్ని కాపాడుకోవాలి.

టాటూ వేయించుకునే 24 గంటల ముందు ఆల్కహాల్ లేదా ఇతర మత్తు పదార్థాలు సేవించకూడదు.

అపాయింట్‌మెంట్‌కు ముందు బాగా తినాలి.

**టాటూ వేసిన తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలు**

టాటూ వేసిన తర్వాత 10 రోజుల వరకు వ్యాయామం మరియు క్రీడలకు దూరంగా ఉండాలి. మూడు వారాల వరకు స్విమ్మింగ్, బీచ్‌లు, బాత్‌టబ్‌లు మరియు జాకుజీలను నివారించాలి. చర్మాన్ని ఎల్లప్పుడూ తేమగా ఉంచుకోవాలి. టాటూ ఆర్టిస్ట్ ఇచ్చిన సూచనలను పాటించాలి.

**టాటూలు సురక్షితమేనా?**

సరైన పద్ధతిలో, తగిన జాగ్రత్తలతో టాటూలు వేయించుకుంటే సురక్షితమే. టాటూ వేసే స్టూడియో పరిశుభ్రంగా ఉండాలి. రంగుల్లో కొన్ని రంగులు అలెర్జీ కారకాలను కలిగి ఉంటాయి. కాబట్టి రంగు టాటూ వేయించుకునే ముందు జాగ్రత్తగా ఉండాలి. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు టాటూ వేయించుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి.

**ఏ టాటూలు ఎక్కువగా నొప్పి కలిగిస్తాయి?**

వేళ్ళపై, అరచేతుల్లో, పాదాలపై, మోకాళ్ళపై, మోచేతులపై, వెన్నెముకపై మరియు నడుముపై వేసే టాటూలు ఎక్కువగా నొప్పిని కలిగిస్తాయి. ముంజేతులు మరియు పక్కటెముకలపై వేసే టాటూలు తక్కువ నొప్పిని కలిగిస్తాయి.

**టాటూలు వెలిసిపోకుండా ఎలా నివారించాలి?**

కాలక్రమేణా టాటూ సిరా విచ్ఛిన్నమవుతుంది. టాటూలు వాటి సంతృప్తతను మరియు స్పష్టతను కోల్పోతాయి. సూర్యరశ్మి, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, టాటూ వేసే ప్రదేశం మరియు పరిమాణం వంటి అంశాలు కూడా టాటూ వెలిసిపోవడానికి కారణమవుతాయి. టాటూ వేసిన తర్వాత సన్‌స్క్రీన్ రాసుకోవడం వల్ల రంగు మారకుండా కాపాడుకోవచ్చు. కీళ్ళు మరియు చర్మపు ముడతలు దగ్గర చిన్న టాటూలు వేయించుకోకపోవడం మంచిది.

**ప్రస్తుతం ఏ టాటూలు ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్నాయి?**

యువత సాధారణంగా సన్నని గీతలతో ఉండే పాతకాలపు టాటూలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. సైబర్ సిగిల్స్ కూడా ప్రస్తుతం చాలా ప్రాచుర్యం పొందాయి. ప్రస్తుత ట్రెండ్ ఏమిటంటే టాటూలను ప్రదర్శన కోసం కాకుండా సొంత సంతృప్తి కోసం వేయించుకుంటున్నారు.

# పిల్లలు ఇలా ప్రవర్తిస్తుంటే... అర్థం ఏమిటో తెలుసా?



**ప్రతి ఇంట్లో పిల్లలు అల్లరి చేయడం సాధారణమే...**

**పిల్లల అల్లరిని నియంత్రించడానికి తల్లిదండ్రులు కోప్పడటమూ తెలిసిందే...**

**కొందరు తల్లిదండ్రుల తీరును బట్టి పిల్లలు ఎలా ప్రవర్తిస్తారనేది తేల్చి చెబుతున్న మానసిక నిపుణులు**

పిల్లలు అన్నాక అల్లరి చేయడం మామూలే. చాలా మంది తల్లిదండ్రులు పిల్లల అల్లరిని కట్టడి చేయడానికి ఏదో రకంగా ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరైతే మరీ తిట్టడం, కొట్టడం వరకు వెళుతుంటారు. అయితే, ఇలా తిట్టడం, కొట్టడం వల్ల పిల్లల ప్రవర్తనలో కొన్ని రకాల మార్పులు వస్తాయని పిల్లల మానసిక నిపుణులు చెబుతున్నారు. అత్యంత కఠినం (స్ట్రిక్ట్)గా వ్యవహరించే వారి పిల్లల్లో ప్రమాదకరమైన ప్రవర్తన అలవడుతుందని హెచ్చరిస్తున్నారు. పిల్లలపై తీవ్ర ఒత్తిడి, కఠినంగా వ్యవహరిండం వల్ల ఈ కింది లక్షణాలు ఏర్పడుతాయని సూచిస్తున్నారు.

**పిల్లల్లో మూడ్ స్వింగ్స్ సమస్య**

పిల్లల పట్ల తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరిస్తూ ఉంటే... పిల్లల్లో మూడ్ స్వింగ్స్ సమస్య తలెత్తుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉద్వేగాలను నియంత్రణలో ఉంచుకోలేకపోతారని... ఉన్నట్టుండి కోపగించుకోవడం, గట్టిగా అరవడం వంటి లక్షణాలు పెరిగిపోతాయని స్పష్టం చేస్తున్నారు.

**అన్నీ దాచిపెట్టే అలవాటు**

తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరిస్తే... వారికి భయపడి అన్ని విషయాలను దాచిపెట్టే అలవాటు పెంచుకుంటారని నిపుణులు చెబుతున్నారు. మంచి అయినా, చెడు అయినా ఓపెన్ గా చెప్పడానికి ఇష్టపడని వ్యక్తులుగా మారతారని స్పష్టం చేస్తున్నారు.

**ఎదురుతిరిగే మనస్తత్వం**

పిల్లలపై తీవ్రంగా ఒత్తిడి పెడితే, రూల్స్ పెడుతూ ఉంటే... ఎదురుతిరగడం, ఎదురు ప్రశ్నించడం మొదలవుతుందని నిపుణులు తేల్చి చెబుతున్నారు. తమ జీవితంపై పెత్తనం ఏమిటనే స్థాయికి ఇది చేరవచ్చని హెచ్చరిస్తున్నారు.

**ఆత్మవిశ్వాసం లేమి...**

తల్లిదండ్రుల కఠిన ప్రవర్తన వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం లోపిస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల పిల్లలను తరచూ తిట్టడం, చెప్పినట్టు వినడం లేదని, ఆశించినట్టుగా చదవడం లేదని అతిగా ఒత్తిడి చేయడం మంచిది కాదని స్పష్టం చేస్తున్నారు.

**మానసికంగా ఆందోళన(యాంగ్జైటీ)కి లోనవడం...**

ఏవైనా చిన్న తప్పులు చేసినా తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరించడం వల్ల పిల్లలు తీవ్ర మానసిక ఆందోళనకు (యాంగ్జైటీ)కి లోనవుతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది దీర్ఘకాలంలో ప్రమాదకరంగా పరిణమిస్తుందని పేర్కొంటున్నారు.

**ఎవరితోనూ కలవలేకపోవడం...**

తల్లిదండ్రుల కఠిన ప్రవర్తన వల్ల పిల్లలు ఎవరితోనూ కలవక,

ఒంటరితనాన్ని ఇష్టపడేవారిగా ი తయారవుతారని నిపుణులు చెబుతున్నారు. స్నేహితులనూ దూరం చేసుకుంటారని, భవిష్యత్తులో ఇంట్రావర్టులుగా మారతారని హెచ్చరిస్తున్నారు.

**ప్రోత్సాహం లేక వెనుకబడిపోవడం**

తరచూ ఇది చేయలేదు, అది చేయలేదు, సరిగా చదవడం లేదంటూ తీవ్రంగా ఒత్తిడి చేసే తల్లిదండ్రుల వల్ల పిల్లల్లో మోటివేషన్ లేకుండా పోతుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు ప్రోత్సాహం కరవై దేనిపైనా దృష్టిపెట్టక వెనుకబడిపోతుంటారని హెచ్చరిస్తున్నారు.

# శ్రీలంకకు షాకిచ్చేందుకు గిల్-గంభీర్ మాస్టర్‌ప్లాన్.. ప్రాక్టీస్‌లోనే ప్రణాళికలు అమలు!

- శ్రీలంక పేసర్ల రివర్స్ స్వింగ్‌పై భారత్ ప్రత్యేక ఫోకస్
- ప్రాక్టీస్ పిచ్‌ను నాలుగో రోజు వికెట్‌లా సిద్ధం చేసిన వైనం
- గిల్ పాత, కొత్త బంతులతో రివర్స్ స్వింగ్ సాధన
- శ్రీలంక మైదానాల్లో బంతి త్వరగా పాతబడే అవకాశం
- ఇప్పటికే మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడిన భారత్




**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత జట్టు.. స్పిన్‌తో పాటు పేసర్ల నుంచి ఎదురయ్యే ముప్పుపైనా ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయం తీసుకుంది. మ్యాచ్‌లో ఎదురయ్యే పరిస్థితులకు తగ్గట్టుగా ప్రాక్టీస్ చేయాలని భావించింది.ఎన్‌సీసీ మైదానంలో ప్రాక్టీస్ కోసం ఉపయోగించిన పిచ్‌ను.. శ్రీలంక 'ఎలెవన్'తో జరిగిన వార్మప్ మ్యాచ్ పిచ్ తరహాలో సిద్ధం చేయాలని గ్రౌండ్ సిబ్బందికి సూచించింది. పిచ్‌పై పగుళ్లు వచ్చేలా చేసి.. నాలుగో రోజు వికెట్‌ను పోలిన పరిస్థితులు కల్పించారు. బంతి రివర్స్ స్వింగ్ అయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని భారత బ్యాటర్లు ఫుట్‌వర్క్‌పై ప్రత్యేకంగా సాధన చేశారు.

నెట్ సెషన్‌లో గిల్ ముగ్గురు త్రో-డౌన్ నిపుణుల నుంచి బంతులు ఎదుర్కొన్నాడు. పాత, కొత్త కూకాబుర్రా బంతులతో రివర్స్ స్వింగ్‌ను ఎదుర్కొనేలా సాధన చేశాడు. అనంతరం అకీబ్ నబీ నుంచి సెమీ-ఓల్డ్ బంతులతో బౌలింగ్ చేయించుకుని మరింత ప్రాక్టీస్ చేశాడు.గాలె పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. అయితే శ్రీలంక మైదానాల్లో బంతి త్వరగా పాతబడుతుందని..

దీంతో రివర్స్ స్వింగ్ కీలకంగా మారొచ్చని టీమ్ మేనేజ్‌మెంట్ అంచనా వేసింది.భారత్ ఇప్పటికే శ్రీలంక 'ఎలెవన్'పై మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడింది. శ్రీలంక మాత్రం ఎలాంటి ప్రాక్టీస్ మ్యాచ్ ఆడకుండానే సిరీస్‌లోకి దిగుతోందని మాజీ పేసర్ ఫర్వీజ్ మహరూఫ్ తెలిపారు. భారత బ్యాటింగ్‌పై సందేహాలు ఉన్నా.. సిరీస్‌కు ఆతిథ్య జట్టు కంటే భారత్ మెరుగ్గా సిద్ధమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

# చోలే భటూరే నుంచి ఫిట్‌నెస్ ఐకాన్‌గా.. కోహ్లీ బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ సీక్రెట్ ఇదే!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కేవలం ఆటలోనే కాకుండా ప్రపంచంలోనే అత్యంత ఫిట్‌గా ఉన్న అథ్లెట్లలో ఒకడిగా సరికొత్త ప్రమాణాలు నెలకొల్పాడు. ఒకప్పుడు చోలే భటూరే, బటర్ చికెన్, స్వీట్లను ఇష్టంగా తినే బొద్దుగా ఉండే కుర్రాడి నుంచి ప్రపంచం మెచ్చే ఫిట్‌నెస్ ఐకాన్‌గా మారిన కోహ్లీ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రయాణం, అతడు పాటించే డైట్, వర్కౌట్ సీక్రెట్స్ ఏంటి అనేది ఇప్పుడు వీ6 తెలుగు వెబ్ సైట్ లో తెలుసుకుందాం.

**టర్నింగ్ పాయింట్ ఇక్కడే:**

తొలి ప్రపంచకప్ ముగిసిన తర్వాత తాను విపరీతమైన అన్‌ఫిట్‌గా ఉన్నానని, పొట్ట వేలాడుతుంటే అంతర్జాతీయ స్థాయిలో రాణించలేనని విరాట్ కోహ్లీ గ్రహించాడు. దాంతో ప్రాసెస్ చేసిన ఆహారానికి, జంక్ ఫుడ్‌కు స్వస్తి చెప్పి పూర్తి క్లీన్ వెజిటేరియన్ డైట్‌కు మారాడు. తాను ఇప్పటికి గతంలో ఆడినట్లే ఆడాలనే స్పష్టమైన లక్ష్యంతోనే కఠోరంగా శ్రమిస్తూ తన ఫిట్‌నెస్ ని కాపాడుకుంటున్నాడు.

**రోజూ కోహ్లీ ఏం తింటాడు?:**

కోహ్లీ తన డైట్‌లో ప్రోటీన్లు, ఆకుకూరలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండేలా జాగ్రత్తపడతాడు.

ఉదయం తినే ఆహారం: గ్లూటెన్ ఫ్రీ బ్రెడ్ (+శ్రీబ్వఅ-టతీవవ ఎతీఝుఐ), నట్స్, సీడ్స్, హెల్తీ వెజిటెబుల్ డిషెస్.

రాత్రి భోజనం: కండరాల బలానికి క్వినోవా (ుబఱఅశ్ఞు), దోసెలు, పప్పు ధాన్యాలు, పాలకూర, సోయా, ప్రోటీన్ షేక్స్ తీసుకుంటాడు.

డిటాక్స్ సీక్రెట్: మెటబాలిజాన్ని పెంచడానికి, శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపడానికి నిమ్మరసంతో కలిపిన గ్రీన్‌టీని రోజుకు 3 నుంచి 4 కప్పులు తాగుతాడు. ఆహారంలో పంచదారను పూర్తిగా దూరం పెడతాడు.

**జిమ్ షెడ్యూల్, వర్కౌట్ ప్లాన్:**


**వారంలో 5,6 రోజులు జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తూ, ఒక్క రోజు మాత్రమే రెస్ట్ తీసుకుంటాడు విరాట్ కోహ్లీ.**

వెయిట్ ట్రైనింగ్, డెడ్‌లిఫ్ట్స్: శరీరంలో బలమైన కండరాలు (ాఝఅ వీబంఎశ్రీవ), స్టామినా పెంచడానికి భారీ డెడ్‌లిఫ్ట్స్ చేస్తాడు.

కార్డియో: లోయర్ బాడీ స్ట్రెంగ్త్, మైదానంలో వేగంగా పరుగెత్తే సామర్థ్యం కోసం హెవీ కార్డియో వ్యాయామాలు చేస్తాడు.

# ఆగస్టు 14 నుంచి టీ 20 వరల్డ్ కప్ క్వాలిఫయర్ మ్యాచ్‌లు.. ఈ చిన్న దేశాల మధ్యనే గట్టి పోటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న 2028 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ కోసం ఐసీసీ సంచలన మార్పులు చేసింది. టోర్నమెంట్‌లో ఉత్కంఠను పెంచేందుకు, వర్ధమాన (ూాంంశిఎఱఫ్వ) దేశాలకు ప్రపంచ వేదికపై మరిన్ని అవకాశాలు కల్పించేలా సరికొత్త ఫార్మాట్‌ను రూపొందించింది. 20 జట్లు పాల్గొనే ఈ మెగా ఈవెంట్‌లో సూపర్ 10, ఎలిమినేటర్స్ రౌండ్లను కొత్తగా ప్రవేశ పెట్టింది.

**సరికొత్త ఫార్మాట్:**

పాత ఫార్మాట్ స్థానంలో మ్యాచ్ మ్యాచ్‌కూ తీవ్ర పోటీ ఉండేలా ఈ కొత్త విభాగాలు తీసుకువచ్చారు.

గ్రూప్ దశ (30 మ్యాచ్‌లు): 20 జట్లను నాలుగు జట్ల చొప్పున 5 గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2 సాధించిన జట్లు సూపర్ 10కి చేరుకుంటాయి.

సూపర్ 10 (20 మ్యాచ్‌లు): 10 జట్లను 5 చొప్పున రెండు గ్రూపులుగా విభజించి రౌండ్-రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. రెండు గ్రూపుల విజేతలు నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు.

ఎలిమినేటర్స్ (2 మ్యాచ్‌లు): సూపర్ 10లో ప్రతి గ్రూప్‌లోని 2వ స్థానంలో నిలిచిన జట్లు, మరో గ్రూప్‌లోని 3వ స్థానంలో ఉన్న జట్లతో తలపడతాయి. ఇందులో విజేతలుగా నిలిచే రెండు జట్లు మిగిలిన రెండు సెమీఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకుంటాయి.

**2028 టోర్నీకి నేరుగా అర్హత సాధించిన 12 జట్లు:**

2026 టీ20 ప్రపంచకప్ ప్రదర్శన, ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా 12 జట్లు ఇప్పటికే 2028 టోర్నమెంట్‌కు నేరుగా తమ స్థానాలను ఖరారు చేసుకున్నాయి: ఆఫ్ఘనిస్తాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, భారత్, ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్ట్ ఇండీస్ లేదా జింబాబ్వే.

**క్వాలిఫైయర్స్ షెడ్యూల్ ఇదే:**

టీ20 వరల్డ్ కప్ లో మిగిలిన 8 స్థానాల కోసం అర్హత ప్రక్రియను ఐసీసీ మరింత ఆసక్తికరంగా డిజైన్ చేసింది. దాని గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

నేరుగా గ్లోబల్ క్వాలిఫైయర్: 2026లో ఆడి నేరుగా అర్హత పొందని కెనడా, ఇటలీ, నమీబియా, నేపాల్, నెదర్లాండ్స్, ఒమన్, యూఏఈ, యూఎస్ఏ జట్లు నేరుగా గ్లోబల్ క్వాలిఫైయర్ ఆడుతాయి.

రీజినల్ క్వాలిఫికేషన్: ప్రాంతీయ టోర్నీల ద్వారా మరో 8 జట్లు (ఆఫ్రికా-2, ఆసియా-2, యూరప్-2, అమెరికాస్-1, ఈఏపీ-1) గ్లోబల్ క్వాలిఫైయర్‌లో ఎంట్రీ ఇస్తాయి. ఇక స్కాట్లాండ్ నేరుగా యూరప్ రీజినల్ ఫైనల్ ఆడుతుంది.

ఆఫ్రికా - ఉగాండా, కెన్యా, టాంజానియా, నైజీరియా, రువాండా, నమీబియా

ఆసియా - నేపాల్, ఒమన్, యూఏఈ , హాంకాంగ్, మలేషియా, కువైట్, బహ్రెయిన్

యూరప్ - స్కాట్లాండ్, జెర్సీ, డెన్మార్క్, ఇటలీ, జర్మనీ, గ్వెర్న్సీ, పోర్చుగల్

తూర్పు ఆసియా-పసిఫిక్ - పాపువా న్యూ గినియా , జపాన్, వనౌటు, ఫిజి, దక్షిణ కొరియా, ఇండోనేషియా

అమెరికాస్ - కెనడా, యూఎస్ఏ , బెర్ముడా, కేమాన్ ఐలాండ్స్, అర్జెంటీనా

# దర్శకులుగా వచ్చి హీరోలుగా!



దర్శకత్వం అనేది ఎంతో బాధ్యతతో కూడుకున్న సవాలుతో కూడిన ప్రయాణం. కెమెరా వెనుక నిలబడి వందలాది మంది సాంకేతిక నిపుణులను, నటీనటులను సమన్వయం చేస్తూ తెరపై అద్భుతాలను ఆవిష్కరించే దర్శకులకు తెరపై నటించడం అంత సులువైన విషయం కాదు. కానీ కొందరు ప్రతిభావంతులైన దర్శకులు ఈ హద్దులను చెరిపేస్తూ కెమెరా ముందు నటిస్తూ బాక్సాఫీస్ వద్ద అసాధారణ రికార్డు సృష్టిస్తున్నారు. కేవలం అతిథి పాత్రలకే పరిమితం కాకుండా పూర్తి స్థాయి హీరోలుగా మారి తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుంటున్నారు.

ఈ అరుదైన కోవకు చెందిన ట్రెండ్‌లో తమిళ, కన్నడ , తెలుగు పరిశ్రమలలో పలువురు ప్రముఖులు ముందు వరుసలో ఉన్నారు. కెమెరా ముందుకొచ్చి ప్రేక్షకులను మెప్పించడం ప్రతి దర్శకుడికి సాధ్యం కాదు. కానీ సరైన కథ, బలమైన స్క్రిప్ట్ పడితే బాక్సాఫీస్ మోత మోగిపోతుందని నిరూపించారు. తమ సినిమాలకే కాకుండా ఇతర దర్శకుల చిత్రాల్లోనూ హీరోగా నటిస్తూ ఇండస్ట్రీలో కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. ఈ కోవలో లోకేష్ కనగరాజ్, ప్రదీప్ రంగనాథన్, రిషబ్ శెట్టి, ఉపేంద్ర, ఎస్.జె. సూర్య వంటి దర్శకులు హీరోలుగా సత్తా చాటుతున్నారు.


కోలీవుడ్‌లో తనదైన టెర్రిఫిక్ మేకింగ్ స్టైల్‌తో స్టార్ డైరెక్టర్‌గా ఎదిగిన లోకేష్ కనగరాజ్ తాజాగా డీసీ తో నటుడిగానూ అదృష్టాన్ని పరీక్షించుకుని సంచలనం సృష్టిస్తున్నారు. ఎలాంటి అంచనాలు లేకుండా విభిన్నమైన ఇంటెన్స్ పాత్రలో కనిపిస్తూ అద్భుతమైన నటనతో సినిమాను బ్లాక్‌బస్టర్ వైపు నడిపిస్తున్నారు. ఈ రేంజ్ పెర్ఫార్మెన్స్ చూస్తుంటే లోకేష్ కేవలం డైరెక్టర్‌గానే కాకుండా నటుడిగానూ ఇండస్ట్రీలో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరచుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

మరో యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ ప్రదీప్ రంగనాథన్ -లవ్ టుడే- సినిమాతో దర్శకుడిగా విజయం సాధించి, ఏకంగా హీరోగా మారి బాక్సాఫీస్ వద్ద రఫ్ ఆడిస్తున్నారు. ఆ తర్వాత వరుసగా -డ్రాగన్-, -డ్యూడ్- వంటి క్రేజీ ప్రాజెక్టులతో యూత్‌లో విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకుని పాన్-ఇండియన్ స్టార్ రేంజ్‌కు ఎదుగుతున్నారు. మరోవైపు కన్నడ చిత్రసీమ నుంచి గ్లోబల్ పాన్-ఇండియన్ స్టార్‌గా ఎదిగిన రిషబ్ శెట్టి కూడా ముందుగా దర్శకుడిగానే ప్రయాణాన్ని ప్రారంభించారు. -కిరిక్ పార్టీ- లాంటి సంచలన సినిమాను తెరకెక్కించిన ఆయనే -కాంతార- చిత్రంతో పూర్తిగా హీరోగా మారి సృష్టించిన సునామి గురించి చెప్పనవసరం లేదు.కన్నడ పరిశ్రమలో సరికొత్త ట్రెండ్‌కు నాంది పలికిన ఉపేంద్ర కూడా దర్శకుడిగా కెరీర్ ప్రారంభించి ఆ తర్వాత హీరోగా మారి సెన్సేషనల్ హిట్స్‌తో ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచారు. అలాగే తమిళంలో ఎస్.జె. సూర్య కూడా నాని రీమేక్ చిత్రం ద్వారా హీరోగా మారి అటుపై విలక్షణ పాత్రలతో పాటు హీరోగా నటిస్తూ సత్తా చాటుకుంటున్నారు. తరుణ్ భాస్కర్, అభిజిత్ వంటి పలువురు దర్శకులు కూడా ఇదే బాటలో నడుస్తూ కెమెరా ముందు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

అంతిమంగా చూస్తే.. తెర వెనుక కథలను అల్లుతూ చిత్ర పరిశ్రమను శాసించిన దర్శకులు, తెర ముందుకు వచ్చి నటులుగా కూడా ప్రతిభను చాటుకోవడం టాలీవుడ్ .. ఇతర భాషా పరిశ్రమలకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది. సాంకేతిక పరిజ్ఞానంపై, కథా కమామిషూపై పూర్తి అవగాహన ఉన్న వీరు హీరోలుగా మారడంతో చిత్రాల స్థాయి మరింత పెరుగుతోంది. భవిష్యత్తులోనూ దర్శకుల నుంచి మరిన్ని అద్భుతమైన చిత్రాలు వచ్చే అవకాశం ఉంది.








Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965